కరీంనగర్ సూర్య
పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల
గురువారం 18 జనవరి 2024 9 పేజీలు



# రాజన్న ఆలయంలో హుండీ లెక్కింపు

సూర్య వేములవాడ టౌన్



2 లో..





# రెండు వేల కోట్లు బూడిదలో పోసిన పన్నీరేనా?

- సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం చేసిన ఖర్చు వృధాయేనా ?
- గత ప్రభుత్వ పథకాలతో మారని పరిశ్రమ దశ
- గొప్ప ఆలోచనతో ప్రభుత్వ పథకాలు, ఆచరణ మాత్రం లోపభూయిష్టం
- బతుకమ్మ చీరలతో లబ్ధి పొందింది బడా బాబులే
- అభివృద్ధికి బదులు తగ్గిన మరమగ్గాల సంఖ్య
- స్క్రాప్ కింద మరమగ్గాలని అమ్ముకున్న ఆసాములు
- కొత్త ఉత్పత్తులు,నూతన టెక్నాలజీ వైపు అడుగిడని నేతన్నలు
- ప్రభుత్వ ఆర్డర్లకే ఎదురుచూపులు..
- కొత్త ప్రభుత్వమైనా మౌలిక మార్పుల దిశగా చర్యలు చేపడుతుందా ?
- పాలిస్టర్ పరిశ్రమ బంద్ నేపథ్యంలో సూర్య ప్రత్యేక కథనం

సూర్య రాజన్న సిరిసిల్ల.

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి గత ప్రభుత్వం ఆరేళ్లలో ఖర్చు చేసిన రెండు వేల కోట్లకు పైగా నిధులు బూడిదలో పోసిన పన్నీరేనా ? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. వస్త్ర పరిశ్రమకు తెలుగు రాష్ట్రాల్లో పేరెన్నికగన్న సిరిసిల్ల పవర్లూమ్ పరిశ్రమ మరోసారి సంక్షోభం దిశగా అడుగులేస్తోంది. ఉత్పత్తి చేసిన వస్త్రానికి మార్కెట్ లేదని నేపంతో పవర్లూమ్ వస్త్ర పరిశ్రమ బందుకు యజమానులు పిలుపునిచ్చారు. దీంతో రెక్కాడితే గాని డొక్కాడని నేత కార్మికుల పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది. ఒకప్పుడు కాటన్ వస్త్ర ఉత్పత్తులకు కేంద్రంగా భాసిల్లిన సిరిసిల్ల,ప్రస్తుతం నాణ్యతలేని పాలిస్టర్ వస్త్రాలకు నిలయంగా మారింది.దశాబ్దాల క్రితమే సొంతంగా ఉత్పత్తులు తయారుచేసి ఇతర రాష్ట్రాల్లో సైతం మార్కెటింగ్ చేసిన సిరిసిల్ల నేతన్నలు, ఇప్పుడు తమ సృజనాత్మకతను మరిచి ప్రభుత్వ ఆర్డర్ల కోసం దేబిరించాల్సిన పరిస్థితి దాపురించింది. అందరికీ ఉపాధినిచ్చే కాటన్ పరిశ్రమ నుండి కొంతమంది జేబులు నింపే మతక రకం పాలిస్టర్ వస్త్రాలను ఉత్పత్తి చేసే కేంద్రంగా సిరిసిల్ల తయారైంది. నేతన్నల పేరుతో ప్రభుత్వ ఆర్డర్లను దారి మళ్లించి కొంతమంది బడాబాబులు మాత్రమే లబ్ధి పొందుతున్నారనేది సిరిసిల్లలో జగమెరిగిన సత్యమే.

2 లో..



## పెద్దపల్లిలో సై అంటున్న "కాకా" మనవడు

- వెంకటస్వామి మార్క్ కోసం ఆరాటం
- "కాకా" తాత అడుగుజాడల్లో వంశీ కృష్ణ

సూర్య కాల్వ శ్రీరాంపూర్



రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో "కాక" మనవడు డాక్టర్ జి వివేకానంద తనయుడు గడ్డం వంశీకృష్ణ కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థిగా రాజకీయ అరంగేట్రం చేయనున్నారు. పెద్దపల్లి పార్లమెంటు స్థానం నుండి అత్యధిక పర్యాయాలు విజయం సాధించి కేంద్ర కార్మిక శాఖ మంత్రిగా, రాష్ట్ర మంత్రిగా, కాంగ్రెస్ పార్టీలో అత్యున్నత పదవుల్లో అనేక బాధ్యతలు నిర్వర్తించి, తనకంటూ దేశంలోనే ఒక మార్క్ ను తెచ్చుకున్న స్వర్గీయ జి వెంకటస్వామి మార్క్ కోసం అతని మనవడు జి వంశీకృష్ణ ఆరాట పడుతున్నారు. పెద్దపల్లి కాంగ్రెస్ పార్లమెంటు అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొంది రాజకీయ అరంగేట్రం (మిగతా 2లో)



## తెలంగాణ ఆత్మగౌరవం గెలిచింది

- తెజస అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం

సూర్య వేములవాడ

కాంగ్రెస్ గెలుపుతో రాష్ట్రంలో తెలంగాణ ప్రజల ఆత్మ గౌరవం గెలిచినట్లని తెజస అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. పౌర సన్మానం కార్యక్రమంలో భాగంగా గురువారం వేములవాడలో శాసనసభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు పౌర సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెజస అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం పాల్గొన్నారు. వేములవాడలో ఆది శ్రీనివాస్ ఎమ్మెల్యేగా గెలుపొందడం అభినందనీయమన్నారు. నియోజకవర్గంలో తనపై పోటీ ఉన్న కార్పొరేట్ శక్తులను ఎదురించి గెలిచాడన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు తెలంగాణ ప్రజల విజయంగా అభివర్ణించారు. అభివృద్ధి పేరిట రాష్ట్రంలో ఆరు లక్షల కోట్లు అప్పు చేసిన కూడా ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. ప్రభుత్వ వైపు ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ (మిగతా 2లో)

## రైతులకు అండగా ఉండాలి..

- అధికారులను ఆదేశించిన కలెక్టర్
- రైతులతో కలిసి వరి నాట్లు వేసిన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

సూర్య పెద్దపల్లి ప్రతినిధి

నారు మడి నుంచి పంట అమ్మకం వరకు ప్రతి దశలో రైతుకు అండగా ఉంటూ అవసరమైన సలహాలు, సూచనలు అందజేసి రైతు లాభదాయక సాగు చేసే దిశగా అధికారులు పని చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. బుధవారం పెద్దపల్లి మున్సిపాలిటీ శివారులోని చందపల్లిలో వరి నాట్లు వేస్తున్న రైతుల పొలాలను పరిశీలించి, సాగు పద్ధతులను, పంటలో వచ్చే లాభం, సాగులో ఎదురవుతున్న ఇబ్బందులు, తదితర అంశాలపై కలెక్టర్ రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయంలో నారుమడి దగ్గరి (మిగతా 2లో)



# రెండు వేల కోట్లు బూడిదలో పోసిన పన్నీరేనా ?

**-సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం చేసిన ఖర్చు వృధాయేనా ?**

ఆకలి చావులు ఆత్మహత్యలతో గత 15 సంవత్సరాల క్రితం తల్లడిల్లిన సిరిసిల్ల నేతన్నలను ఆదుకోవడానికి గత బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రభుత్వ ఆర్డర్లను సిరిసిల్ల పవర్లూమ్ పరిశ్రమకు ఇవ్వడమే కాకుండా, నేతన్నలను ఆదుకోవాలని సదుద్దేశంతో బతుకమ్మ చీరల పథకాన్ని ఆరు సంవత్సరాల క్రితం ప్రవేశపెట్టింది. ఉపాధి లేక అప్పుల బాధతో ఆత్మహత్యలు చేసుకుంటున్న నేత కార్మికులకు ఉపాధి కల్పించే ఎంతో గొప్ప ఆశయంతో ప్రవేశపెట్టిన బతుకమ్మ చీరల పథకం సిరిసిల్లలో కొంతమంది బడా బాబుల పాలిట కొంగు బంగారం గా తయారయింది. పేరుకు మ్యాక్స్ సంఘాలకే ప్రభుత్వం ఆర్డర్ ఇస్తున్నట్లు రికార్డుల్లో ఉన్నప్పటికి నిజానికి ఆ సంఘాలన్నీ పదిమంది పెట్టుబడిదారుల చేతుల్లోనే కొనసాగుతున్నయన్నది బహిరంగ రహస్యమే. అధికారుల అండదండలు, ప్రభుత్వ సహకారంతో కొంతమంది సేట్లు కోట్లకు పడగలెత్తితే, ఆసాములు, కార్మికుల జీవితాలు మాత్రం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మిగిలిపోయాయి.

**- అభివృద్ధికి బదులు తగ్గిన మరమగ్గాల సంఖ్య.**

నిజానికి గత ప్రభుత్వం చెబుతున్నట్లు సిరిసిల్ల నేత పరిశ్రమకు అందించిన చేయూతతో ఇక్కడ వస్త్ర పరిశ్రమ వెలిగిపోవాలి. కానీ అందుకు భిన్నంగా సిరిసిల్లలో మరమ్మగాలు తగ్గిపోవడం గమనార్హం. ఆరు సంవత్సరాల క్రితం సిరిసిల్లలో బతుకమ్మ చీరల పథకం ప్రవేశపెట్టినపుడు జియో టాగింగ్ ద్వారా లెక్కేసిన మరమగ్గాల సంఖ్య 32000.కానీ ఆరు సంవత్సరాల తర్వాత ప్రభుత్వం 2500





కోట్లకు పైగా సిరిసిల్లకు ఆర్డర్లు ఇచ్చిన నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న మరమగ్గాల సంఖ్య చేనేత జౌళి శాఖ లెక్కల ప్రకారం 24000 మాత్రమే. నిజానికి ప్రభుత్వం చెబుతున్నట్లు అభివృద్ధి జరిగి ఉంటే మరమగ్గాలు మరింతగా పెరగాలే కానీ ఎనిమిది వేలకు పైగా మరమగ్గాలు తగ్గడం విశేషం. ఆరు సంవత్సరాల క్రితం రెండువేల ఒక వందగా ఉన్న అసాముల సంఖ్య నేడు 1800 పడిపోయింది. అంటే 250 మంది ఆసాములు తమకు వస్త్ర పరిశ్రమలో ఉపాధి లేక మరమగ్గాలను స్క్రాప్ కింద అమ్ముకొని పరిశ్రమ నుంచి బయటకు వచ్చారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. నాటి బిఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో గొప్ప ఉద్దేశంతో పథకాలు ప్రవేశపెట్టినప్పటికీ వాటిని సరైన దిశగా నడిపించి, అందరికీ ఉపాధి కల్పించడంలో మాత్రం అధికారులు విఫలమయ్యారు. ప్రభుత్వంలో ఉన్న పెద్దలు సైతం సిరిసిల్ల పరిస్థితిపై పత్రికల్లో వార్తలు వచ్చిన పట్టించుకోకపోవడంతో కొంతమంది సేట్లు ఆడింది ఆట పాడింది పాటగా తయారైంది. పెద్ద ఎత్తున సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు నిధులు సమకూర్చినప్పటికీ ప్రభుత్వానికి మాత్రం మంచి పేరు రాకపోవడం శోచనీయం.

**- ప్రభుత్వ ఆర్డర్లకే ఎదురుచూపులు.**

నేతన్నలకు ప్రభుత్వ ఆర్డర్ల ద్వారా ఉపాధి కల్పించి, కొత్త టెక్నాలజీ పై అవగాహన పెంపొందించడం ద్వారా మార్కెట్లో మంచి డిమాండ్ ఉన్న వస్త్రాల తయారీకి శిక్షణ ఇప్పించాల్సిన ప్రభుత్వం కేవలం మతకరకం బతుకమ్మ చీరలు తయారు చేయించి బడా బాబుల జేబులు నింపడమే సిరిసిల్లకు శాపం అయింది.అంతకుముందు ఎంతో కొంత సొంత ఉత్పత్తులు తయారుచేసి మార్కెటింగ్ చేసుకునే వారు సైతం బతుకమ్మ చీరల లాభాలతో పాలిస్టర్ వైపు మళ్ళీ పోయారు. మరోవైపు కాటన్ వస్త్ర పరిశ్రమలో పనిచేసే వారు లేక పరిశ్రమ అంతరించిపోయేందుకు సిద్ధమైంది. ప్రభుత్వ ఆర్డర్లకు అలవాటుపడ్డ ఇక్కడి వ్యాపారులు, నేతన్నలు,కార్మికులు సృజనాత్మక వస్త్రాల నేత పనిని మరిచిపోయారు. మార్కెట్లో డిమాండ్ ఉన్న వస్త్రాల తయారీని చేపట్టలేక ప్రభుత్వ ఆర్డర్లకు అలవాటు పడిపోయారు. ప్రభుత్వం ఆర్డర్లు ఇవ్వకుంటే వస్త్ర పరిశ్రమ సంక్షోభంలోకి వెళ్లి తిరిగి నేతన్నలు ఆత్మహత్యల దిశగా పయనిస్తారని ప్రభుత్వాన్ని బెదిరించేందుకు సైతం నేతన్నల ముసుగులో బడా బాబులు పావులు కదుపుతున్నారు.

**-కొత్త ప్రభుత్వమైనా మౌలిక మార్పుల దిశగా చర్యలు చేపడుతుందా ?**

అధికారంలో ఉన్న ఏ ప్రభుత్వమైనా నేత కార్మికులను ఆదుకునేందుకు సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టాల్సిందే అన్నది కాదనలేని సత్యం. అయితే ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, ఆర్డర్లు నేతన్నలకు ఎంత మేర ఉపయోగపడుతున్నాయి ? పథకాలు పక్కదారి పడుతున్నాయా అన్నది చూసుకోవాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వాలదే. అలా కాకుంటే గత ప్రభుత్వంలో లాగా సుమారు 2500 కోట్లకు పైగా సిరిసిల్ల నేత పరిశ్రమకు ఆర్డర్లు ఇచ్చినప్పటికి మళ్లీ ప్రభుత్వం పైనే ఆధారపడే పరిస్థితి దాపురిస్తుంది. కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో నెలకొన్న పరిస్థితులపై సమగ్ర దర్యాప్తు జరిపించి, నేత కార్మికుల నైపుణ్యం పెంపొందించే దిశగా, పరిశ్రమ సావలంబన సాధించే దిశగా పథకాలను రూపొందించాల్సి ఉంది. కేవలం కొద్ది మంది మాత్రమే లబ్ధి పొందుతున్న పథకాలను రద్దుచేసి నిజమైన, అర్హులైన నేత కార్మికుల సంక్షేమం కోసం పాటుపడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# పెద్దపల్లిలో సై అంటున్న "కాకా" మనవడు

**(మొదటి పేజి తరువాయి)**

చేయడానికి అత్యంత ఉత్సాహంతో ఉన్నారు. ఇప్పటికే తనదైన శైలిలో రాజకీయ అడుగులు వేస్తున్నారు.వంశీకృష్ణకు పెద్దపల్లి పార్లమెంటు టికెట్ ఇవ్వడానికి కాంగ్రెస్ పార్టీ అధిష్టాన వర్గం సూచనప్రాయంగా ఓకే చెప్పినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. అత్యధిక మార్లు తన కుటుంబం నుండి పార్లమెంటు సభ్యులుగా ప్రజలకు ఎనలేని సేవ చేసిన కుటుంబం తిరిగి కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేసి ప్రజలకు సేవలు అందించాలని ఆసక్తి చూపుతుంది. జి వెంకటస్వామి "కాక" 1989, 1991, 1996 లో వరుసగా మూడు ఎన్నికలలో గెలిచి హ్యాట్రిక్ సాధించారు. తిరిగి 2004 ఎన్నికలలో వెంకటస్వామి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా గెలుపొందారు. 2009 లో జరిగిన పార్లమెంటు ఎన్నికలలో జి వెంకటస్వామి తనయుడు డాక్టర్ జి వివేకానంద పార్లమెంట్ సభ్యులుగా గెలుపొంది తన రాజకీయ అరంగేట్రం చేశారు. పెద్దపల్లి పార్లమెంటు నియోజకవర్గం ఏర్పడిన 1962 నుండి అత్యధిక సార్లు గడ్డం "కాక" కుటుంబమే పార్లమెంట్ ఎన్నికల్లో విజయాలు సాధించి చరిత్ర పుటల్లోకి ఎక్కారు. అయితే మన డిసెంబర్ లో జరిగిన ఎన్నికల్లో పెద్దపల్లి పార్లమెంటు నియోజకవర్గం లోని ఏడు అసెంబ్లీ స్థానాలలో కాంగ్రెస్ పార్టీ ఇంతవరకు ఎప్పుడు ఏ ఎన్నికల్లో గెలవని విధంగా ఏడు నియోజకవర్గాలలో సుమారు 3,07,820 అధికంగా ఓట్లు సాధించి విజయం పొందారు. పెద్దపల్లి పార్లమెంటు పరిధిలో పెద్దపల్లి, మంథని, ధర్మపురి, చెన్నూరు, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి నియోజకవర్గాలలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. అయితే కాక మార్క్ ను నిలపడానికి పెద్దపల్లి మాజీ పార్లమెంటు సభ్యులు చెన్నూరు ఎమ్మెల్యే డాక్టర్ జి వివేకానంద. మాజీ మంత్రి బెల్లంపల్లి ఎమ్మెల్యే జి వినోద్ తో పాటు పలువురు నాయకులు మృదుస్వభాషి, కలుపుగోలుతనం కలిగిన





యువతకు ఆదర్శప్రాయుడైన గడ్డం వంశీకృష్ణను పెద్ద పెల్లి పార్లమెంటు అభ్యర్థిగా నిలపడానికి అత్యంత ఆసక్తి చూపిస్తున్నట్లు రాజకీయ వర్గాల ద్వారా తెలుస్తుంది. పెద్దపల్లి పార్లమెంటు పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో అప్పుడు "కాక" ఆధ్వర్యంలో మొన్నా జి వివేకానంద ఆధ్వర్యంలో, ప్రస్తుతం వంశీకృష్ణ ఆధ్వర్యంలో విశాఖ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్న విషయం తెలిసిందే. పెద్దపల్లి పార్లమెంటు పరిధిలోని ప్రజల హృదయాల్లో నిలిచిన గడ్డం కుటుంబం వినయం, విధేయతకు గడ్డం కుటుంబమే కేరాఫ్ అంటున్నారు పలువురు. ఎంపీ అంటేనే వెంకటస్వామి కుటుంబం, వెంకటస్వామి కుటుంబం అంటేనే ఎంపీ అనే నానుడి ప్రజల్లో చూరగోన్నది. పదవి ఉన్న, లేకున్నా ప్రజల్లోనే ఉంటూ ప్రజలకు ఎల్లప్పుడు తమ సేవలు అందిస్తూ ఆపదలో ఉన్నవారికి ఆపన్న హస్తం అందిస్తున్న కాకా కుటుంబం ఈసారి పెద్దపల్లి పార్లమెంటు ఎన్నికల్లో విజయం సాధించడం తథ్యమని ప్రజలు చర్చించుకుంటున్నారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పెద్దపల్లి పార్లమెంటు టికెట్ ను వంశీకృష్ణకు ఇవ్వడానికి సూచనప్రాయంగా అంగీకరించడంతోనే పార్లమెంటు నియోజకవర్గం లో జి వంశీకృష్ణ పర్యటిస్తూ ప్రజా ప్రతినిధుల, నాయకుల కార్యకర్తల మద్దతు కోరుతూ అత్యంత ఉత్సాహంగా ఇప్పటికే తనదైన శైలిలో రాజకీయ అడుగులు వేస్తున్నారు.

## తెలంగాణ ఆత్మగౌరవం గెలిచింది

**(మొదటి పేజి తరువాయి)**

తనపై నమ్మకం ఉంచి గెలిపించిన ప్రజలకు అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు. అంతకుముందు వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## రాజన్న ఆలయంలో హుండీ లెక్కింపు

**సూర్య వేములవాడ టౌన్**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి సన్నిధిలోని ఆలయ ఓపెన్ స్లాబ్ లో హుండీ లెక్కింపు బుధవారం చేపట్టారు. ఈ లెక్కింపు కార్యక్రమాన్ని ఈవో కృష్ణ ప్రసాద్ క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నారు. సీసీ కెమెరాలు పోలీసు పటిష్ట భద్రత నడుమ హుండీ ఆదాయం లెక్కింపు చేస్తున్నట్లు ఈవో తెలిపారు ప్రతినెల 15 నుంచి 20 రోజుల వ్యవధిలో హుండీ లెక్కింపు చేస్తున్నట్లు వెల్లడించారు.

## రైతులకు అండగా ఉండాలి..

**(మొదటి పేజి తరువాయి)**



నుంచి రైతులు పంట కోసి అమ్మకం చేసే వరకు ప్రతి దశలో రైతులకు అందుబాటులో ఉంటూ వారికి అవసరమైన సలహాలు, సూచనలు అందజేస్తూ అధిక లాభం పొందే విధంగా సంబంధిత అధికారులు పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. నాట్లు వేయడానికి ఎంత పెట్టుబడి అవుతుంది, పంటకు రోగాలు వస్తే వాడే పురుగు మందులు, ఎరువుల లభ్యత పురుగు మందుల లభ్యత, పంట దిగుబడి, కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, ధాన్యం మిల్లులకు తరలింపు, రైతులకు జరిగే చెల్లింపు, తదితర ప్రతి దశలో రైతులకు అండగా ఉంటూ అవసరమైన సలహాలు, సూచనలు అందజేయాలని అన్నారు. నూతన సాగు పద్ధతులను రైతులకు వివరిస్తూ తక్కువ పెట్టుబడితో అధిక లాభం వచ్చే విధంగా సూచనలు చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.పంటకొనుగోలు సమయంలో వరి ధాన్యం తరుగు గురి కాకుండా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ రైతులకు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ రైతులతో కలిసి పొలంలో వరి నాట్లు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆదిరెడ్డి, పెద్దపల్లి మండల వ్యవసాయ అధికారి అలివేణి, క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి వినయ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర నూతన చట్టంపై డ్రైవర్ల వినూత్న నిరసన

**- హిట్ అండ్ రన్ చట్టంతో డ్రైవర్లకు తిప్పలు**

**సూర్య, హుజురాబాద్**

కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన నూతన చట్టం హిట్ అండ్ రన్ చట్టాన్ని పూర్తిగా తొలగించాలని డిమాండ్ చేస్తూ లారీ డ్రైవర్, క్లీనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కేసి క్యాంపు లోని అసోసియేషన్ కార్యాలయం వద్ద రోడ్డుపై వెళ్తున్న వాహన డ్రైవర్లకు పువ్వులు ఇస్తూ వినూత్నంగా నిరసన తెలిపారు. బుధవారం హుజురాబాద్ లారీ అసోసియేషన్ నాయకులు కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కొత్త చట్టానికి నిరసనగా ఒక రోజు సమ్మె నిర్వహించారు. అనంతరం కరీంనగర్ - వరంగల్ ప్రధాన రహదారిపై కొద్దిసేపు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ హిట్ అండ్ రన్ కేసులో డ్రైవర్ కు 10 ఏళ్ల జైలు శిక్ష, 7 లక్షలకు పైగా భారీ జరిమానా విధించాలనే చట్టాన్ని డ్రైవర్లు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. ఒకవేళ జైలు శిక్ష పడితే పదేళ్ల పాటు డ్రైవర్ల కుటుంబాలకు దూరంగా ఉండాల్సి వస్తుందని, తమ కుటుంబాలు రోడ్డున పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆ స్థాయిలో ఏడు లక్షల జరిమానవి చెల్లించడం కూడా సాధ్యం కాదని, ఏ నిబంధన వల్ల కొత్తవారు ఈ వృత్తిని చేపట్టేందుకు ముందుకు రారని లారీ అసోసియేషన్ నాయకులు పేర్కొన్నారు. అందుకే శిక్షతో పాటు జరిమానా కూడా తగ్గించాలని వారు డిమాండ్ చేశారు. లేదంటే పూర్తిగా చట్టాన్ని తొలగించాలన్నారు. ఈ ఆందోళనలో లారీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎండి సలీం, కార్యదర్శి ఎండి. మాజీద్, ఉపాధ్యక్షుడు ఎండి. జానీ, నాయకులు జగన్నాథం, ఎండి. సజ్జు, రమేష్, తిరుపతి, హైమద్, రషీద్, రాంప్రసాద్, జగన్నాథం, మల్లయ్య, శంకరయ్య, హరి శంకర్, మోహిన్, శ్రీను, అరవింద్, పలువురు డ్రైవర్లు పాల్గొన్నారు.



# సర్పంచులను మనోవేదనకు గురిచేసిన బిఆర్ఎస్ పార్టీ..

## - జెడ్పి ఫ్లోర్ లీడర్ గీకురు రవీందర్

సూర్య చిగురు మామిడి...



చిగురుమామిడి మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన పత్రికా సమావేశంలో కాంగ్రెస్ నాయకులు జెడ్పి ఫ్లోర్ లీడర్ గీకురు రవీందర్ మాట్లాడుతూ సర్పంచుల పెండింగ్ బిల్లుల గురించి కేటీఆర్ కు మాట్లాడే అర్హత లేదన్నారు. సర్పంచుల పెండింగ్ బిల్లుల గురించి మాజీ మంత్రి హాస్యస్పందంగా మాట్లాడుతున్నారని దయ్యాలు వేదాలు వల్లించినట్లుందని ఎద్దేవా చేశారు. అధికారంలో ఉన్నప్పుడు నెలల తరబడి గ్రామపంచాయతీ బిల్లులు చెల్లించకుండా సర్పంచులను మనోవేదనకు గురి చేసింది బిఆర్ఎస్ ప్రభుత్వమే అన్నారు. సకాలంలో బిల్లులు చెల్లించకుండా సర్పంచుల ఉసురు పోసుకున్న ఘనత బిఆర్ఎస్ పార్టీదేనన్నారు. బిల్లులు రాక అప్పులు కట్టలేక మనస్థాపానికి గురై సర్పంచులు ఆత్మహత్య చేసుకున్న సంఘటనలను కేటీఆర్ మర్చిపోయారన్నారు. మండలాలలో జిల్లా కేంద్రాలలో సొంత పార్టీలో ఉన్న బిఅర్ఎస్ సర్పంచులు ఆందోళనలు చేపట్టిన సంగతి, సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశాలను బహిష్కరించారని, పల్లె ప్రగతి కార్యక్రమానికి దూరంగా ఉన్నారని, కొంతమంది సర్పంచులు బిల్లులు సకాలంలో చెల్లించినందుకు ఏకంగా పార్టీకే రాజీనామా చేసిన ఉదాంతాలను గుర్తు చేసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి విడుదలైన 15 ఫైనాన్స్ బిల్లులను కూడా ఫ్రీజింగ్ చేస్తూ సర్పంచులను నానా ఇబ్బందులకు గురి చేశారన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో స్థానిక సంస్థలైన గ్రామపంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాలకు విలువ లేకుండా పోయిందని, స్థానిక సంస్థల తీర్మానాలకు ప్రాధాన్యత లేకుండా పోయిందన్నారు. ప్రజాప్రతినిధులకు విలువ లేకుండా అధికారాన్ని అంతటిని తమ గుప్పిట్లో ఉంచుకొని స్థానిక సంస్థల నాయకత్వాన్ని నిరుగార్చరని విమర్శించారు అధికారంలో ఉన్నన్నినాళ్లు సర్పంచులను మానసిక క్షోభకు గురిచేసి ప్రస్తుతం పెండింగ్ బిల్లుల కోసం పోరాడుతామని చెప్పడం సిగ్గుచేటనీ అన్నారు. ఖజానాను ఖాళీ చేసి ఆరు కోట్ల అప్పులు చేసి చిప్పలు చేతికిచ్చిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా పాలన గ్రామపంచాయతి ప్రాధాన్యతను పెంచిందన్నారు. కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థలను బలోపేతం చేస్తూ గ్రామ స్వరాజ్యం ఏర్పాటుకు చిత్తశుద్ధితో పనిచేస్తు ఒదన్నారు. ఈ కార్యక్రమములో కాంగ్రెస్ నాయ కులు కోనేటి రాములు, వంగ కనుకయ్య, గట్టు ప్రశాంత్, పోటు మల్లారెడ్డి, రాజు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు

సూర్య - మానకొండూర్



ముగ్గును శుభానికి, మంగళత్వానికి ప్రతీకగా భావిస్తారని, లక్ష్మీదేవికి ఆనందాన్ని కలిగించే అంశాలలో రంగవల్లు ఒకటని అన్నారు. మానకొండూర్ జెడ్పిటీసి తాళ్లపల్లి శేఖర్ గౌడ్. కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండల కేంద్రంలోని జెడ్పి బాయ్స్ హై స్కూల్ లో మోదుంపల్లి రంజిత్ ఆధ్వర్యంలో మకర సంక్రాతిని పురస్కరించుకొని మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై గెలుపొందిన మహిళలకు నగదును అందజేయడంతో పాటు, పోటీల్లో పాల్గొన్న మహిళలకు కన్సోలేషన్ బహుమతులు అందజేశారు.మొదటి బహుమతి పావని 5వేలు,2వ బహుమతి శాలిని 4వేలు,3వ బహుమతి మేఘన 3వేలు,4వ బహుమతి ఉమ 2వేలు,5వ బహుమతి జయశ్రీ వెయ్యి రూపాయలు,6వ బహుమతి యుగాల అనూష వెయ్యి రూపాయలు గెలుపొందారు.

అనంతరం శేఖర్ గౌడ్ మాట్లాడుతూ భారతీయ సంప్రదాయంలో ముగ్గులకు ఎంతో ప్రాధాన్యం ఉందని పేర్కొన్నారు. అనంతరం నిర్వహకులు మోదుంపల్లి రంజిత్ ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ మహిళా కార్పొరేటర్లు చొప్పరి జయశ్రీ, గందే మాధవి, ఎంపీటీసీ ఉండింటి సులోచన, మానకొండూరు వార్డు మెంబర్లు బోడ రాజశేఖర్, దండు రాములు, బీఆర్ఎస్ నాయకులు పిట్టల మధు, ఉండుండి శ్యామ్సన్, రంజిత్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా

సూర్య కరీంనగర్ ప్రతినిధి



స్థానిక శ్రీ చైతన్య డిగ్రీ, పీజీ కళాశాలలో,సాహితీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కళాశాల ఆవరణంలో ఈ నెల 20 తేదీ శనివారం రోజున మెగా ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల చైర్మన్ ముద్దసాని రమేష్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతు,మెగా ఉద్యోగ మేళా లో మొదలగు విద్యా అర్హతలు కలిగిన నిరుద్యోగ యువతి,యువకులు పెద్ద సంఖ్య లో పాల్గొని ఈ సదవకాశాన్ని వినియోగించుకొని, ప్రముఖ ప్రైవేటు కంపెనీల లో ఉద్యోగాలు పొందగలరని తెలియజేశారు. ఈ ఉద్యోగ మేళా లో Tredz IT, Edubridge, HDFC Bank, Vetero TechSoft Solution, Appolo, Enlight మొదలగు సుమారుగా 35 కు పైగా కంపెనీలు పాల్గొంటున్నట్లు సాహితీ ఫౌండేషన్ ఫౌండర్, చైర్మన్ రాముల కుమార్ తెలిపారు. తమ ఫౌండేషన్ ద్వారా గత 10 సంవత్సరాల నుండి తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రెండు రాష్ట్రాల లో అనేక సామాజిక కార్యక్రమాలు, వృత్తి, నైపుణ్యం పెంపొందించే శిక్షణ కార్యక్రమాలు, మహిళా సాధికారత కార్యక్రమాలు, ప్రముఖంగా మెడికల్ సంబందిత కార్యక్రమాలు, ఇలాంటి ఉద్యోగ మేళా లు ప్రముఖంగా నిర్వహించడం జరుగుతుందని,ఇలాగే రాబోయే రోజుల్లో ఇంకా పెద్ద ఎత్తున మా వంతుగా సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తాము అని పేర్కొన్నారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అని కళాశాల చైర్మన్ రమేష్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ Dr శ్రీనివాస్ , సాహితీ ఫౌండేషన్ చైర్మన్ తెలియజేశారు, ఈ కార్యకరమలో సంస్థ చీఫ్ కో ఆర్డినేటర్ మార్క సంతోష్ కుమార్, శ్రీ చైతన్య డిగ్రీ, పీజీ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## ఉద్యోగ ఉపాధ్యాయ ఉద్యమ నేతకు సన్మానం

సూర్య గన్నేరువరం

గన్నేరువరం మండలంలోని గుండ్లపల్లిలో బుధవారం టి పి ఆర్ టి యు వ్యవస్థాపక అధ్యక్షులు టిపిసిసి అధికార ప్రతినిధి హర్షవర్ధన్ రెడ్డి నీ సర్పంచ్ బేతెల్లి సమతా రాజేందర్ రెడ్డి తో కలిసి టిసిపిఎస్ఈఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హన్మండ్ల భాస్కర్ సన్మానించారు. అనంతరం గాల్ రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ సిపిఎస్ విధానం రద్దు తో పాటు ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుటకు కృషి చేస్తానని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కి రాష్ట్రములోని ఉద్యోగుల నిరుద్యోగుల సమస్యల పట్ల అవగాహన ఉందని అన్నారు. హన్మండ్ల భాస్కర్ మాట్లాడుతూ సిపిఎస్ రద్దు కొరకు కృషి చేసి సిపిఎస్ ఉద్యోగులు వారి కుటుంబాల్లో వెలుగులు నింపాలని హర్షవర్ధన్ రెడ్డిని కోరారు. ఈ కార్యక్రమంలో టి పి ఆర్ టి యు రాష్ట్ర అధ్యక్షులు ఉమాకర్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్వతి సత్యనారాయణ, సర్పంచ్ బేతెల్లి సమత రాజేందర్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వంగల సత్తిరెడ్డి, వంగల రామ్ రెడ్డి ,మాజీ ఎంపిటిసి కొరివి తిరుపతి ,రఫీ, వార్డు సభ్యులు నాగపురి శంకర్ తదితరులు పాల్గొన్నారు.





## 100 రోజుల్లో ఆరుగ్యారెంటీలు అమలు చేయాలి

### - బిజెపి కరీంనగర్ అసెంబ్లీ కన్వీనర్ దూబాల శ్రీనివాస్

సూర్య కరీంనగర్ ప్రతినిధి

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం 100 రోజుల్లో ఆరుగ్యారెంటీ పథకాలను అమలు చేయాలని బిజెపి కరీంనగర్ అసెంబ్లీ కన్వీనర్ దుబాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం కొత్తపల్లిలో బిజెపి ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పార్టీ శ్రేణులందరూ కష్టపడి పని చేయాలని సూచించారు. అలాగే కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరుగ్యారెంటీ పథకాల ను త్వరితగతిన అమలుచేసి అర్హులందరికీ న్యాయం చేయాలన్నారు. లోగడ కెసిఆర్ బిఆర్ఎస్ ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టినా, ఆచరణ అమలులో విఫలమయ్యారని పేర్కొన్నారు. పథకాల పేరిట ప్రజలను మభ్యపెట్టి కెసిఆర్ మోసగించడంతోనే జరిగిన ఎన్నికల్లో బిఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రకటించిన ఆరు పథకాలను వంద రోజుల్లో అమలు చేస్తామని ప్రకటించినందున , నిరుపేద మధ్యతరగతి ప్రజలు ఎందరో ఆశతో ఎదురుచూస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత ప్రభుత్వం మాదిరిగా మోసం చేయకుండా అర్హులైన ప్రజలందరికీ పథకాలను అందించి న్యాయం చేయాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ప్రజలను మోసం చేసి, పథకాల అమల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే బిజెపి నుండి తీవ్ర ప్రతిఘటన తప్పదని ఆయన హెచ్చరించారు. ఈ మీటింగ్ లో పాల్గొన్న వారు కొత్తపల్లి టౌన్ అధ్యక్షులు కెంచే శేఖర్, మాజీ ఎంపీపీ వాసాల రమేష్, కౌన్సిలర్ నర్సయ్య, హరి ప్రసాద్, నరేష్, ప్రదీప్, రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## పెన్షనర్ల సంఘం డైరీ, క్యాలెండర్ ల ఆవిష్కరణ

సూర్య, హుజురాబాద్

తెలంగాణా ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (తాప్రా) రూపొందించిన నూతన సంవత్సర డైరీ క్యాలెండర్ ఆవిష్కరణ బుధవారం హుజురాబాద్ తహశీల్దార్ కార్యాలయం వద్ద జరిగింది. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ ఎస్టీఓ లు మోయిజ్ జహాన్, పి. శివరామకృష్ణ, శనిగరం జిల్లా చందుపట్ల జనార్ధన్, కట్ట నాగ భూషణా చారి, ఇల్లందుల సమ్మయ్య, మండల వీరస్వామి, గరిగె చంద్రయ్య, చోల్లేటి మల్లారెడ్డి, పరాంకుశం సనత్ కుమార్, రామ కృష్ణయ్య, కమర్షియల్ టాక్స్ ఆఫీసర్, రాజిరెడ్డి, గుండేటి మొగిలయ్య, పి. రామకృష్ణ, జి. బుచ్చిరాజం, వి. భాస్కర్, టి. అమరేందర్ తదితరులు పాల్గొన్నారు.



## బాల కార్మికుల కోసం ఇటుక బట్టీల్లో, హెూటళ్లలో తనిఖీలు

సూర్య, హుజురాబాద్



ఆపరేషన్ స్మైల్ 10 కార్యక్రమంలో భాగంగా హుజురాబాద్ పట్టణంలోని ఇటుక బట్టీలు, రెస్టారెంట్లు, హెూటల్స్, దుకాణలను బుధవారం ఆపరేషన్ స్మైల్ టీం సందర్శించి తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో మైనర్ పిల్లలు ఎవరైనా పని చేస్తున్నారా అని అరా తీశారు. ఈ సందర్భంగా చైల్డ్ హెల్ప్ లైన్ 1098 జిల్లా కో ఆర్డినేటర్ సంపత్ మాట్లాడుతూ యాజమానులకు బాల కార్మిక చట్టాల గురించి తెలియాలన్నారు. బాల కార్మికులను ఎవరు పనిలో పెట్టుకోరాదని సూచించారు. బాలకార్మిక నిర్మూలన కోసం అందరు సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ లేబర్ ఆఫీసర్ చందన, బాలల పరిరక్షణ అధికారి రమేష్, చైల్డ్ హెల్ప్ లైన్ కేసు వర్కర్ ప్రియాంక, పోలీస్ కానిస్టేబుల్ రవీందర్, యజమానులు తదితరులు పాల్గొన్నారు.



## మృతురాలి కుటుంబానికి పరామర్శ

సూర్య, హుజురాబాద్

ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు సొల్లు బాబు తల్లి సొల్లు సంతోషమ్మ కుటుంబాన్ని బుధవారం జెడిఎస్ సెక్యులర్ పార్టీ రాష్ట్ర నాయకులు వడ్లూరి వాసు సందర్శించి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మృతి పట్ల ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వెంకన్న, మహేందర్ తదితరులు ఉన్నారు.

## సెంట్రల్ స్కూల్ ఏర్పాటు కోసం స్థల పరిశీలన

సూర్య,రాయికల్



రాయికల్ మండలంలోని బోర్న పల్లి గ్రామంలో సెంట్రల్ స్కూల్ ఏర్పాటు నిమిత్తం జగిత్యాల నరసింహమూర్తి ఆధ్వర్యంలో అధికారుల బృందం స్థల పరిశీలన చేశారు. గ్రామంలోని సర్వేనెంబర్ 183 లో గల 10 ఏకారాల స్థలాన్ని అధికారులు పరిశీలించారు.వీరి వెంట తాహసిల్దార్ ఎం.ఎ ఖయ్యుం,ఆరై లు దేవదాసు,కాంతయ్య, గ్రామ ప్రజా ప్రతినిధులు పాదం లత రాజు, ఆంజనేయులు కవిత,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# బిసి విద్యార్థులకు పూర్తి ఫీజులు చెల్లించాలి

**సూర్య జగిత్యాల**

బిసి విద్యార్థులకు పూర్తి ఫీజులు చెల్లించాలని ఆ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో బిసి సంక్షేమ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జగిత్యాల జిల్లా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో 2008 లో ప్రవేశపెట్టిన పూర్తి రీయింబర్స్మెంట్ పథకాన్ని రద్దు చేసి 2014 లో బిఆర్ ఎస్ ప్రభుత్వం సగం ఫీజులు ఇస్తూ విద్యార్థుల గొంతు కోసిందని విమర్శించారు. అప్పటినుంచి ఇప్పటివరకు పెద్దఎత్తున విద్యార్థులకు పూర్తి ఫీజులు ఇవ్వాలని ఎన్ని ధర్నాలు చేసినా గత ప్రభుత్వం స్పందించలేదని అన్నారు. కనీసం ఇప్పుడైనా కాంగ్రెస్ ప్రభుత్వం నాటి పథకాన్ని పునరుద్ధరించాలని ప్రభుత్వానికి విన్నవించారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థులకు ఇస్తున్న మాదిరిగా బిసి, ఇబిసి విద్యార్థులకు కూడా పూర్తి ఫీజులు మంజూరు చేయాలని కోరారు. ఐటిఐ, ఐఐఎం, ఎన్ ఐటి కోర్సులు చదివే విద్యార్థులకు కూడా పూర్తి ఫీజులు చెల్లించాలని కోరారు. పెరిగిన ధరలకణుగుణంగా మెస్ ఛార్జీలు, స్కాలర్ షిప్ లను పెంచడానికి బడ్జెట్ పెంచాలన్నారు. పెరిగిన ధరల ప్రకారం ఎస్సీ ఎస్టీ



బిసి కాలేజీ హాస్టల్ విద్యార్థుల మెస్ చార్జీలు రూ.1500 నుంచి రూ. 2500 కు పాఠశాల హాస్టల్లకు గురుకుల పాఠశాల విద్యార్థుల ఆహారపు చార్జీలు 8 నుంచి 10 వ తరగతి చదివే వారికి రూ.1100 నుంచి రూ.2000 కు 3వ తరగతి నుంచి 7వ తరగతి చదివే వారికి రూ. 950 నుంచి రూ.1600 కు పెంచాలని కోరుతూ ప్రస్తుత సంవత్సరంలో అదనంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి రెండు బిసి గురుకుల పాఠశాలలు మంజూరు చేయాలని, విదేశీ విద్య స్టైఫండ్ పథకం కింద అర్హులందరికీ స్టైఫండ్ చెల్లించేందుకు బడ్జెట్ మహా చెల్లించేందుకు బడ్జెట్ రూ. 60 కోట్ల నుంచి రూ.300 కోట్లు పెంచాలన్నారు. గత ప్రభుత్వం బీసీ విద్యార్థుల కొరకు కొత్తగా 271 బిసి గురుకుల పాఠశాలలు మంజూరు చేసిందని అవన్నీ అద్దె భవనాల్లో నడుస్తున్నందున వాటికి సొంత భవనాలు, సరైన వసతి సౌకర్యాలు కల్పించాలని కోరారు. రాష్ట్రంలో 290 కాలేజీ చర్లకు సొంత భవనాలు నిర్మించి సౌకర్యాలు కల్పించాలన్నారు. బీసీ స్టడీ సర్కిల్ లకు రూ. 200 కోట్లు కేటాయించాలని కోరారు. బడ్జెట్లో బీసీ కార్పొరేషన్ కు సబ్సిడీ రుణాల కోసం రూ. 4 వేల కోట్ల బడ్జెట్ కేటాయించాలని, ఎంబిసి కార్పొరేషన్ కు రూ. 2 వేల కోట్ల బడ్జెట్ కేటాయించాలని కోరారు. 12 బీసీ కులాల ఫెడరేషన్లకు జనాభా నిష్పత్తిలో రూ.2 వేల కోట్లు కేటాయించాలని, కులాంతర వివాహాలు చేసుకునే బిసి కులాల వారికి ప్రోత్సాహక పారితోషికం రూ.2 లక్షల 50 వేలకు పెంచాలని, బిసి అడ్వకేట్ లకు ఇచ్చే స్టైఫండ్ రూ.1000 నుంచి రూ.10 వేలకు పెంచాలని, బిసి కాలేజీ హాస్టల్ విద్యార్థులకు పాకెట్ మనీ నెలకు రూ.500 మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి అలిశెట్టి ఈశ్వరయ్య, యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కొక్కు గంగాధర్, బి.సి సంక్షేమ సంఘం జగిత్యాల నియోజకవర్గం అధ్యక్షులు తిరుపురం రాంచందర్, యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అనుమల్ల సంజయ్ సామ్రాట్, బిసి విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు జాజాల రమేష్, మరియు బి.సి నాయకులు తిరుపురం శ్రవణ్ కుమార్, బీసీ నాయకులు పాల్గొన్నారు.

## మైనారిటీ గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**సూర్య జగిత్యాల టౌన్**

మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాల 2024-25 విద్యా సంవత్సరానికి గాను జగిత్యాల మైనార్టీ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశం పొందడానికి అర్హతగల విద్యార్థులు ఈ నెల18 నుండి ఫిబ్రవరి 06 లోపు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి సాయిబాబా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆఫ్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు నేరుగా మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలలో ప్రకటించిన తేదీల్లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 5వ తరగతిలో మైనార్టీ విద్యార్థులకు 60 సీట్లు, బీసీ- 10, ఎస్సీ-5, ఎస్టీ-3, ఓసీ-2 కలిపి మొత్తం 80 సీట్లు ఉన్నాయన్నారు. మైనారిటీ విద్యార్థులకు మాత్రమే పాఠశాలలో 6, 7, 8వ, కళాశాలలో ద్వితీయ సంవత్సరంలో ఉన్న ఖాళీలకు కూడా ప్రవేశాలు తీసుకొనబడునని వివరించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.1,50,000, పట్టణంలో వార్షిక ఆదాయం రూ.2,00,000లోపు ఉండాలని తెలిపారు. www.tmreis.telangana.gov.in వెబ్ సైట్ లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పాస్ పోర్ట్ సైజ్ ఫోటో, ఆధార్ కార్డ్, జనన ధృవీకరణ పత్రము లేదా స్టడీ సర్టిఫికేట్, కుటుంబ ఆదాయ సర్టిఫికేట్, కులము సర్టిఫికేట్, సెల్ నంబరు, నివాస ధృవీకరణ సర్టిఫికేట్ జత చేయాలన్నారు

## జ్యూట్ బ్యాగుల పంపిణీ

**సూర్య -కోరుట్ల**



కోరుట్ల పట్టణంలోని 33 వార్డ్ లో పద్మావతి సమాఖ్య లోని 26 సంఘాల మహిళ సభ్యులకు బుధవారం మున్సిపల్ కమిషనర్ టి. రాజేశ్వర్ అందజేశారు ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వల్ల రాబోయే కాలంలో మానవ మనుగడకే ప్రమాదం అని అన్నారు.ప్లాస్టిక్ వాడకం వల్ల ప్రజలకు క్యాన్సర్ వివిధ రోగాలు వచ్చే ప్రమాదం ఉందని అందుకే ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీ గా చేయడానికి ప్రజలందరూ సహకరించాలని ఆయన కోరారు. 33వ వార్డు కౌన్సిలర్ రుద్ర సుజాత మాట్లాడుతూ ప్రతి మహిళ ప్లాస్టిక్ వాడకుండ ఉండాలని తెలిపారు. మహిళలు ప్లాస్టిక్ వాడడం వల్ల అనారోగ్యాలకు గురి కావడమే కాకుండా చిన్న పిల్లల ఆరోగ్యానికి హానికరమని ఆమె అన్నారు. మెప్మా %ఎ.శీ% శివ మాట్లాడుతూ మెప్మా లోని మహిళ సంఘాలు ప్లాస్టిక్ వాడకుండా మిగతా వారికి ఆదర్శంగా ఉండాలని ఆయన తెలిపారు.ప్రతిరోజు మన ఇంట్లో వాళ్ళు బజార్ నుండి ప్లాస్టిక్ కవర్లలో తినుబండారాలు తీసుక రావడం వల్ల ప్లాస్టిక్ లో ఉండే విష పదార్థాల వల్ల మనకు మన పిల్లలకు హానికరంగా తయారు అవుతాయని అందుకే ప్లాస్టిక్ ను సమూలంగా నాశనం చేయడానికి ప్రతి మహిళ ప్రతి మహిళా సంఘ సభ్యులు కంకణం కట్టుకోవాలని ఆయన హితవు పలికారు.ఈ కార్యక్రమంలో ఇంఛార్జి టీఎంసీ సంధ్య, ఆర్ వి రజనీ, మహిళ అధ్యక్షురాలు మహిళ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## పండ్ల మార్కెట్ ని శాశ్వతంగా నిర్వహించాలి

- తెలంగాణ రాష్ట్ర మార్కెటింగ్ డైరెక్టర్ ను కలిసిన ఎమ్మెల్యే ,ఎమ్మెల్సీ.

**సూర్య జగిత్యాల ప్రతినిధి**



జగిత్యాల చల్ గల్ మార్కెట్ ను నిరంతరం సంవత్సరం పొడవునా శాశ్వతంగా పండ్ల మార్కెట్ గా అందుబాటు లో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మి భాయిని ఎమ్మెల్యే డా సంజయ్,ఎమ్మెల్సీ ఎల్ రమణ లు కోరారు. మంగళవారం ఆమె కార్యాలయంలో కలిసిన వారు మార్కెట్ అభివృద్ధికి మంజూరు అయిన కోటి డెబ్బై లక్షలు టెండర్ ప్రక్రియ పూర్తి కావడం జరిగిందనీ, కోటి రూపాయిలు ముదోల్ మార్కెట్ నుండి లోన్ గా తీసుకోగా వాటిని మార్కెట్ అభివృద్ధికి కేటాయించాలని, మ్యాంగో ట్రేడర్ లు ప్రతి సంవత్సరం పొడవునా వివిధ పండ్ల మార్కెట్ లు నిర్వహించే విధంగా ప్రభుత్వం కేటాయించిన పది ఎకరాల్లో తాత్కాలిక షెడ్లు అద్దె ప్రాతిపదికన ఏర్పాటు చేసుకునే విధంగా అవకాశం కల్పించాలని మార్కెటింగ్ డైరెక్టర్ ను ఎమ్మెల్సీ ఎల్ రమణ ,ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ లు కోరారు. ఇక్కడ మున్సిపల్ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్ ,ఇంచార్జి ఎంపీపీ రాజేంద్ర ప్రసాద్, నాయకులు సమిండ్ల శ్రీనివాస్, మ్యాంగో అసోసియేషన్ అధ్యక్షులు మోయిన్, మాజీ అధ్యక్షులు మంజూర్, రషీద్ తదితరులు పాల్గొన్నారు .

## బషీర్ కుటుంబాన్ని పరామర్శించిన బెల్లంపల్లి ఎమ్మెల్యే

**సూర్య ఎండపల్లి**



ఎండపల్లి మండల కేంద్రంలోని సీనియర్ కాంగ్రెస్ నాయకులు ప్రస్తుత ఎంపీటీసీ ఎం డి బషీర్ మాతృమూర్తి వొజ్రబి ఇటీవల అనారోగ్యంతో మరణించడం జరిగింది, ఇట్టి విషయం తెలుసుకున్న బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఎంపీటీసీ బషీర్ కుటుంబాన్ని పరామర్శించారు అనంతరం వొజ్రబి ఆత్మకు శాంతి చేకూరాలని పుష్పాంజలి ఘటించి , కుటుంబ సభ్యులను ప్రగాఢ సానుభూతి తెలిపారు ,ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అభిమానులు పాల్గొన్నారు

## బాధితుడి కుటుంబాన్ని పరామర్శించిన జువ్వాడి కృష్ణారావు

**సూర్య మెట్ పల్లి టౌన్**



పట్టణానికి చెందిన నక్క కళ్యాణ్ అనారోగ్యం తో మరణించగా బుదవారం వారి కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు వారి గృహానికి వెళ్లి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం భాదిత కుటుంబీకులకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జెట్టిలింగం, మాజీ సర్పంచ్ పూదరి సర్సాగౌడ్, శేఖ్ మహ్మద్, బుర్ర మహేందర్ తదితరులు పాల్గొన్నారు.




## వైకుంఠ రథం బహుకరణ

**సూర్య- కోరుట్ల**



మండలంలోని సంగెం గ్రామంలో బుధవారం కోరుట్ల పట్టణానికి చెందిన కొత్త గణేష్, కొత్త శ్రీనివాస్ దంపతులు వారి యొక్క తల్లిదండ్రులు, లైన కీర్తిశేషులు కొత్త శ్రీరాములు లక్ష్మీల జ్ఞాపకార్థం కొన్ని కాలాలపాటు చిరస్థాయిగా ఉండాల నీ ప్రజలు జ్ఞాప కం ఉంచుకోవాలని ఉద్దేశంతో గ్రామానికి తల్లితండ్రుల పేరును ఏదో ఒకటి చేసి నిలబెట్టలని సంఘం గ్రామానికి వైకుంఠ రథం ను బహూకరించారు. ఇట్టి కార్యక్రమంలో, వారి కుటుంబ సభ్యులు సురేష్ ,జ్ఞానేశ్వర్, జగన్, ముక్క రాజు, రాము ,ప్రవీణ్, సాయి, సంపత్ సంఘం సర్పంచ్ చెప్పాల నరసయ్య ,కోరుట్ల వైస్ ఎంపీపీ చీటి స్వరూప, చీటి వెంకటరావు ,సుధవేని భూమయ్య, శనిగారపు శంకర్ ,చక్కని గణేష్, నల్లకుండ దామోదర్, గోపిడి లక్ష్మారెడ్డి, ధోని రాజు, శనిగరపు గణేష్, కల్లూరు దేవయ్య, ఇల్లెందుల శ్రీనివాస్, సత్యనారాయణ ,గంగ స్వామి, కాంగ్రెస్ పార్టీకి చెందిన జువ్వాడి కృష్ణారావు , పోతిగంట శంకర్ , ముంజరాజం ,తీగల మహేష్ ,రామచంద్రరావు లు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలను పరామర్శించిన జువ్వాడి

**సూర్య- కోరుట్ల**



పట్టణంలో ఇటీవల మరణించిన పలు కుటుంబాలను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కృష్ణారావు బుధవారం పరామర్శించారు. పట్టణానికి చెందిన ఏం బేరి సత్యనారాయణ ,మామిడిపల్లి శ్రీనివాస్ మాతృమూర్తి తో పాటు ధర్మారం గ్రామానికి చెందిన మొండిలింగం మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.ఆయన వెంట పట్టణ అధ్యక్షుడు తిరుమల గంగాధర్, కౌన్సిలర్ ఎంబేరి నాగభూషణం, సత్యనారాయణ ,చిలువేరు విజయ్, ఎంపీటీసీ నాగిరెడ్డి సుభాష్ రెడ్డి ,మాజీ ఉపసర్పంచ్ దూడ రంజిత్ రెడ్డి, బాబు రెడ్డి, గణేష్ తదితరులు ఉన్నారు.

## వరి పొలాలను పరిశీలించిన వ్యవసాయ అధికారి

**సూర్య మెట్ పల్లి టౌన్:02**



మెట్ పల్లి మండలం కొనరావుపేట్ మరియు కొండ్రికర్ల గ్రామాలలో వ్యవసాయ అధికారి షాహిద్ అలీ వరి పొలాలను సందర్శించారు. అనంతరం వరిలోనీ చీడపీడలను గమనించారు. ఈ సందర్భంగా షహీద్ అలి రైతులతో మాట్లాడుతూ వరి పొలాల్లో మోగి పురుగు ఉధృతి అధికంగా ఉందని, దీనివల్ల వారి మోగి పడిపోయి రైతులు అధిక నష్టానికి గురి అవుతారని అన్నారు. అనంతరం మోగి ఉధృతి ఎక్కువగా ఉన్న పొలాల్లో రైతులు వెంటనే గమనించి కార్పోహైడ్రోక్లోరైడ్ ఫోర్ జి గుళికలు ఎకరానికి 8 నుంచి 10 కిలోలు లేదా క్లోరం ట్రినేం రోల్ 0.4%గ్ర% గుళికలు నాలుగు కిలోలు పొలంలో సమదాపులుగా పడేటట్లు చల్లుకొని ఉధృతిని నివారించుకోగలరని రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ భూమేశ్వర్, రైతులు అని రెడ్డి మారుతి, జవుద రమేష్, గంగారెడ్డి తదితర రైతులు పాల్గొన్నారు.

## రెండు ఆలయాల్లో దొంగతనం

**సూర్య మెట్ పల్లి**





మెట్ పల్లి మండలం ఆత్మ నగర్ గ్రామంలో ని హనుమాన్ మందిరం మరియు మల్లన్న గుడిలో దొంగలు పడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం అర్ధరాత్రి హనుమాన్ గుడి తాళాలు పగలగొట్టారని,అలాగే హుండీ రాకపోయేసరికి సమీపంలోని వాగు దగ్గరికి వెళ్లి హుండిని పగలగొట్టి డబ్బులు తీసుకుని హుండీనీ వదిలిపెట్టారు అని తెలిపారు. అనంతరం సమీపంలో ఉన్న మల్లన్న గుడిలో హుండీ పగలగొట్టి డబ్బులు తీసుకుని, అనంతరం విగ్రహాల పైన ఉన్న యాభై తులాల మూడు వెండి హారాలనూ ఎత్తుకెళ్లినట్లు స్థానికులు తెలిపారు. సంఘటన స్థలానికి పోలీసులు వచ్చి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

# అధికారుల సంఘం ఎన్నికలు...కొనసాగుతున్న నామినేషన్ల పర్వం

**-19వ తేదీ వరకు నామినేషన్లు -28వ తేదీ వరకు ఎన్నికలు**

**సూర్య, సెంటినరీ కాలనీ**

సింగరేణి సంస్థ లో అధికారుల సంఘం(సిఏంఓఏ) ఎన్నికలకు నామినేషన్ల పర్వం కొనసాగుతుంది. ఈ నెల 19వ తేదీ వరకు నామినేషన్లకు గడువు ఉంది. సింగరేణి సంస్థలో 11 ఏరియాలు, జైపూర్ పవర్ ప్లాంట్ లో కలుపుకొని 12 ఏరియాల కమిటీలతో పాటు సెంట్రల్ కమిటీ కి ఎన్నికలు జరగనున్నాయి. సింగరేణి సెంట్రల్ కమిటీలో అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, రెండు ఉపాధ్యక్షులు, రెండు జాయింట్ సెక్రటరీ లు, ట్రెజరర్, జాయింట్ ట్రెజరర్ పోస్టులతో కలుపుకుని మొత్తం 8 పోస్టులు ఉంటాయి. అదే విధంగా ప్రతి ఏరియా కు 8 పోస్టులు ఉంటాయి. సింగరేణి లో 2400 మంది అధికారులు ఉన్నారు. ఈ నెల 28న ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల అధికారి జీఎం(సేఫ్టీ) కె.గురవయ్య వ్యవహరిస్తున్నారు. ఎన్నికల కొరకు ప్రత్యేక వెబ్ సైట్ ను ఏర్పాటు చేశారు. సీక్రెట్ బ్యాలెట్ ద్వారా ఎన్నిక జరుగుతుంది. నామినేషన్లు వేసే అధికారులు ఆ ఏరియా జీఎం లకు నామినేషన్ పత్రాలు అందించవలసి ఉంటుంది.



# శ్రీరాముని ఆలయ నిర్మాణం చరిత్రాత్మకం.

**- కాల్వ శ్రీరాంపూర్ ఎంపీపీ నూనేటి సంపత్.**

**సూర్య కాల్వ శ్రీరాంపూర్**

భారతదేశ కోట్లాది హిందువుల ఆరాధ్య దైవమన శ్రీరాముని ఆలయ నిర్మాణం చరిత్రాత్మకమైనదని కాల్వ శ్రీరాంపూర్ ఎంపీపీ నూనేటి సంపత్ యాదవ్, సర్పంచ్ బుర్ర మంగ సదానందం లు అన్నారు. బుధవారం కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని మంగపేటలో అయోధ్య రాముల అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేశారు. పురోహితులు సువర్ణ రాజేందర్ శర్మ , వల్లూరి మహేష్ శర్మ, భాస్కర్ శర్మ, సుధీర్ శర్మ ఆధ్వర్యంలో రాములవారి అక్షింతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ నూనేటి సంపత్, సర్పంచ్ బుర్ర మంగ సదానందం లు మాట్లాడుతూ అయోధ్యలో భవ్యమైన రామాలయ నిర్మాణం పూర్తి చేసి ప్రపంచంలోని కోట్లాది హిందువుల కలను సాకారం చేయడం గర్వించదగ్గ విషయమన్నారు. ఐదు దశాబ్దాల హిందువుల చిరకాల కోరిక నెరవేరడం మన అదృష్టమన్నారు. హిందువులు ఎన్నో కష్ట నష్టాలకు ఓర్చి ప్రాణాలను సైతం రామాలయ నిర్మాణం కోసం అర్పించారని, ఎట్టకేలకు భారత అత్యున్నత న్యాయస్థానం తీర్పుతో మందిర నిర్మాణానికి ఆ శ్రీరామచంద్రుని ఆశీస్సులతోనే మార్గం సుగమమైందన్నారు.జనవరి 22న మందిరం ప్రారంభవుతున్న సందర్భంగా ప్రాణ ప్రతిష్ట సమయంలో ప్రతి ఇంటిలో ఈ రాముల వారి అక్షంతలను ప్రతి ఒక్కరు నెత్తిపై చల్లుకొని దైవానుగ్రహము పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నూనెటి సంపత్, సర్పంచ్ బుర్ర మంగ సదానందం, వార్డు సభ్యులు, కమిటీ సభ్యులు నారాయణ, రంగు సదానందం, రమేష్, శేఖర్, మహేష్, గ్రామస్తులు మహిళలు, పాల్గొన్నారు.

# పాత కక్షలతో దంపతులపై దాడి

**- పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన బాధితులు**

**సూర్య ముత్తారం**

పాత కక్షలు దృష్టిలో ఉంచుకొని దంపతులపై దాడి చేసిన సంఘటన ముత్తారం మండలంలోని లక్కారం గ్రామంలో చోటుచేసుకుంది. బాధితురాలు దోరి మంజుల జరిగిన సంఘటనపై ముత్తారం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదులో తెలిపిన ప్రకారం దోరి శ్రీనివాస్ తన కుటుంబంతో కలిసి లక్కారం లో నివసిస్తున్నాడు.16వ తేదీ సాయంత్రం ఫిర్యాదుదారు మంజుల ఇంటి ముందు నిలబడి ఉండగా అదే గ్రామానికి చెందిన సమీప బంధువు వీరగోని రాజేశం కుటుంబ సభ్యులు శ్రీనివాస్ మంజుల దంపతులపై పాత కక్షలు మనసులో ఉంచుకొని బూతులు తిడుతూ విచక్షణ రహితంగా దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దాడిలో భర్త శ్రీనివాస్ తో పాటు మంజులకు తీవ్ర గాయాలైనట్లు తెలిపారు. దాడి చేసిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధితురాలు మంజుల ముత్తారం పోలీస్ స్టేషన్లో బుధవారం రోజున ఫిర్యాదు చేశారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మధుసూదన్ రావు తెలిపారు.

# టైర్డ్ సింగరేణి ఉద్యోగులకు 19న దీపావళి బోనస్ చెల్లింపు

**సూర్య, సెంటినరీ కాలనీ**

సింగరేణి సంస్థలో పనిచేసి పదవీ విరమణ పొందిన అర్హులైన ఉద్యోగులకు 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఈ నెల 19న లాభాల వాటా, 21వ తేదీన దీపావళి బోనస్ యాజమాన్యం చెల్లించనుంది.

# పద్మశాలి క్యాలండర్ ఆవిష్కరించిన అదనపు కలెక్టర్

**సూర్య పెద్దపల్లి**



తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం (టిపియు ఎస్) క్యాలెండరు ను బుధ వారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అరుణ శ్రీ ఆవిష్కరించారు. పెద్దపల్లి కలక్టరేట్ లో అదనపు కలెక్టర్ కార్యాలయంలో క్యాలెండర్ విడుదల చేసి పంపిణీ చేశారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సేవాభావం అలవర్చుకుని సమాజ సేవలో పద్మశాలి ఉద్యోగులు ముందుండాలని పిలుపునిచ్చారు. పేదలకు అండగా ఉండే కార్యక్రమాలు నిర్వహిస్తూ అందరి మన్ననలను పొందాలని సూచించారు. పెద్దపల్లి జిల్లా పద్మశాలి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కొలిపాక సారయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాముల దత్తాద్రి, జిల్లా ప్రధాన కార్యదర్శి పరికిపండ్ల కోటేశం, అసోసియేట్ అధ్యక్షులు గౌడ ఆంజనేయులు, ఉపాధ్యక్షులు మహేశుని వెంకటేశం, సహాయకార్యదర్శి వేముల సతీష్ కుమార్, బత్తుల వినయ్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ పెండెం సత్యనారాయణ, కార్యవర్గసభ్యులు మామిడాల కరుణాకర్, చిలగాని అశోక్ కుమార్, గట్టు రమేష్ లతో పాటు ప్రాథమిక సభ్యులు సిరిపురం రాఘవులు, పులి గోపికృష్ణ, వేముల రమేష్, మిట్టపెల్లి తిరుపతి, బూర మోహన్, పి.కుమారస్వామి, ఎల్లె రమాదేవి, యన్.రాజు పాల్గొన్నారు.

# పెద్దపల్లి పార్లమెంట్ బరిలో స్థానికున్ని గెలిపించాలి..

**సూర్య పెద్దపల్లి**



పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం వలస నాయకులకు అడ్డా కాకూడదని, రానున్న ఎంపీ ఎన్నికల్లో స్థానికున్ని అయిన తనను గెలిపించాలని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ నతానియేలు ప్రజలను కోరారు. స్థానిక ప్రెస్ క్లబ్ లో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు పెద్దపల్లి పార్లమెంట్ నుండి నియోజక వర్గానికి సంబంధం లేని వారు ఎన్నికయ్యారని అన్నారు. వలస రాజకీయ నాయకుల వల్ల పెద్దపల్లి ఎక్కువ వెనుకబడిందని వాపోయారు. పార్లమెంట్ నియోజక వర్గం అన్ని రంగాల్లో నిరాదరణకు గురైందని ఆరోపించారు. సమస్యల పరిష్కారంలో వలస నాయకులు విఫలమయ్యారని విమర్శించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉంటానని తన అభ్యర్థిత్వాన్ని బలపరచి గెలిపించాలని నతానియేలు ప్రజలను కోరారు. సమావేశంలో బంద్ సొసైటీ అధ్యక్షులు, పల్లెల వీరస్వామి, దొడ్డి బాపు, జంగ మహేందర్ రెడ్డి, కర్రె మహేందర్ రెడ్డి, యాలాద్రి సపోజ్, తదితరులు పాల్గొన్నారు.




# నేడు ద్విచక్ర వాహనాల వేలం...

**- ఎక్సైజ్ సీఐ ఎం శ్రీనివాస్**

**సూర్య పెద్దపల్లి ప్రతినిధి**

వివిధ నేరాలలో పట్టుబడిన 5 వాహనాలను గురువారం ఉదయం 10 గంటలకు పెద్దపల్లి ఎక్సైజ్ స్టేషన్ లో వేలం వేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ ఎం.శ్రీనివాస్ తెలిపారు. వేలం వేయు వాహనాలలో హెూండా షైన్, బజాజ్ పల్సర్, గ్లామర్, సిబి ట్విస్ట్, స్ప్లెండర్ ఉన్నట్లుసి.ఐ. ఎం.శ్రీనివాస్ తెలిపారు.

# బాలికా సాధికారత మిషన్ వర్క్‌షాప్ ప్రారంభం

**సూర్య-గోదావరిఖని:**



రామగుండం ఎన్టీపీసీ యాజమాన్యం సిఎస్ఆర్-సిడి కింద ఐదు రోజులపాటు నిర్వహించే పరివర్తనాత్మకమైన బాలికా సాధికారత మిషన్ వర్క్‌షాప్‌ను బుధవారం ఇక్కడి ఎన్టీపిసి ప్రాజెక్ట్ ఏజిఎం (హెచ్ఆర్) బిజోయ్ కుమార్ సిక్దర్ ప్రారంభించారు. స్కిల్ డెవలప్‌మెంట్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, రిఫ్రెషర్ కోర్స్, డ్యాన్స్ లో శిక్షణ తీసుకునేందుకు ప్రభావిత గ్రామాలకు చెందిన మొత్తం 54 మంది అమ్మాయిలు ఇందులో పేర్లు నమోదు చేసుకున్నారు. వర్క్‌షాప్ ప్రారంభ కార్యక్రమం ఒక ప్రత్యేక వేడుకను సంతరించుకోవడంతో పాటు, పుట్టినరోజు వేడుకను కూడా ఈ వేదికపై జరుపుకోవడం సంతోషంగా ఉందని అతిథులు అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో డీజిఎం(హెచ్ఆర్) శామ్యూల్ ప్రశాంత్, డిఎంఎస్ సీనియర్ సభ్యులు, హెచ్ఆర్ విభాగానికి చెందిన పలువురు అధికారులు పాల్గొన్నారు.

# షాదిఖానా కొరకు నిధులు మంజూరు చేయించండి

**సూర్య, హుజురాబాద్**

హుజురాబాద్ పట్టణంలోని ముస్లిం షాదీఖానా నిర్మాణం కొరకు రెండు కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయించి నిర్మాణం పూర్తి చేయాలని బుధవారం సింగాపూర్ లోని క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ బాబు ను జిల్లా మసీదు ఈద్గా మేనేజ్ మెంట్ కమిటీల అధ్యక్షుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ విజ్ఞప్తి చేశారు. గతంలో మంజూరైన నిధులతో పనులు పూర్తి కాలేదని, రెండు కోట్ల రూపాయలు మంజూరి ప్రభుత్వం ద్వారా చేయిస్తే షాదిఖానా పనులు పూర్తయితాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ముస్లిం నాయకులు ఎండి. అప్సర్, గఫర్, ఖాలీద్ హుస్సేన్, తౌసిఫ్, అలీమ్, అఫు, జలీల్ తదితరులు పాల్గొన్నారు.



# మైనారిటీ గురుకులాలలో ప్రవేశాల కొరకు దరఖాస్తుల ఆహ్వానం..

**సూర్య పెద్దపల్లి ప్రతినిధి**

ఫిబ్రవరి 6 లోపు మైనారిటీ గురుకులాలలో ప్రవేశాల కొరకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మొహమ్మద్ మేరాజ్ మహ్మూద్ బుధవారం తెలిపారు. సెక్రటరీ, టి.ఎం.ఆర్.ఈ.ఐ.ఎస్,హైదరాబాద్ ఆదేశాల ప్రకారం, 2024-25 విద్యా సంవత్సరానికి గాను తెలంగాణ మైనారిటీ గురుకుల పాఠశాల/ కళాశాలలలో 5 వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందడం కొరకు ఆన్ లైన్ లో ధరఖాస్తు చేసుకోవడానికి నోటిఫికేషన్ జారీ చేసినట్లు తెలిపారు. పెద్దపల్లి జిల్లాలోని 3 మైనారిటీ పాఠశాలల్లో 5వ తరగతిలో రామగుండం మైనారిటీ బాలుర గురుకుల పాఠశాలలో మైనార్టీ విద్యార్థులకు 60 సీట్లు, బీసీ- 10, ఎస్సీ-5, ఎస్టీ-3, ఓసీ-2 కలిపి మొత్తం 80 సీట్లకు, పెద్దపల్లి/మంథని మైనారిటీ గురుకుల బాలికల పాఠశాలలో మైనార్టీ విద్యార్థులకు 30 సీట్లు, బీసీ- 5, ఎస్సీ-2, ఎస్టీ-2, ఓసీ-1 కలిపి మొత్తం 40 సీట్లకు, వీటికి అదనంగా 6,7,8 తరగతులలో మిగిలిన సీట్లకు అలాగే రామగుండం/మంథని మైనారిటీ బాలుర/బాలికల గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంపిసి, బైపిసి కోర్సులకు, పెద్దపల్లి మైనారిటీ గురుకుల బాలి కల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంఈసి, సిఈసి కోర్సులకు (ముస్లింలు, క్రిస్టియన్లు, బౌద్దులు, జైనులు, సిక్కులు, పార్సిలు మాత్రమే) ధరఖాస్తు చేసుకోవ చ్చని, ఎలాంటి ఫీజు లేకుండానే ఫిబ్రవరి 6 లోపు ఆన్ లైన్ లో www.tmreis.telangana. gov.in వెబ్ సైట్ ద్వారా ధరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకునే సమయంలో పాస్ పోర్ట్ సైజ్ ఫోటో, ఆధార్ కార్డ్, జనన ధృవీకరణ పత్రం లేదా స్టడీ సర్టిఫికేట్, కుటుంబ ఆదాయ సర్టిఫికేట్, కులం సర్టిఫికేట్ (అవసరమైనచో), సెల్ నంబరు,నివాస ధృవీకరణ సర్టిఫికేట్ జత చేయాలని అన్నారు. మైనారిటీ గురుకులాలలో ప్రవేశాలపై ఇతర వివరాలకు పాఠశాలల లేదా కళాశాలల ప్రిన్సిపాళ్లను ( పెద్దపల్లి గర్ల్స్ స్కూల్ 7331170848, పెద్దపల్లి గర్ల్స్ కాలేజీ 9603313883, రామగుండం బాలుర స్కూల్ 7331170845, రామగుండం బాలుర కాలేజీ 9948978628, మంథని గర్ల్స్ స్కూల్ - 7995057944, మంథని గర్ల్స్ కాలేజీ- 7995057944 నందు సంప్రదించాలని మొహమ్మద్ మేరాజ్ మహ్మూద్ తెలిపారు.

# 15 రోజుల్లోగా సీఎంఆర్ డెలివరీ లక్ష్యం పూర్తి చేయాలి

## - తహశీల్దార్ లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

**సూర్య రాజన్న సిరిసిల్ల**

వచ్చే 15 రోజుల్లోగా సీఎంఆర్ డెలివరీ లక్ష్యాన్ని పూర్తి చేయాలని జిల్లాలోని తహసీల్దార్లను కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. సీఎంఆర్ డెలివరీ వేగవంతం, భూ సంబంధిత ఫిర్యాదుల పరిష్కారం, ఓటు నమోదు దరఖాస్తుల పరిష్కారం సహా పలు అంశాలపై ఆర్డీఓ లు, తహశీల్దార్ లకు జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి %×ణూజ% నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బుధవారం దిశా నిర్దేశం చేశారు. జిల్లాలోని తాసీల్దార్లు అన్ని రైస్ మిల్ లు రన్ అయ్యేలా మానిటర్ చేయాలని చెప్పారు. సీఎంఆర్ రోజూ వారి టార్గెట్ నిర్దేశించుకునీ టార్గెట్ పూర్తి చేయాలని సూచించారు. ప్రత్యేక దృష్టి పెట్టి లక్ష్యాన్ని చేరుకోవాలని ఆదేశించారు. అనంతరం ధరణి, ఇతర భూసంబ%శీ%ధిత సమస్యలపై సమీక్షించారు. హైకోర్ట్ , ఇతర ఉన్నత న్యాయ స్థానాల పెండింగ్ కేసుల పరిష్కారం పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. కోర్ట్ ఆర్డర్ ప్రకారం టైమ్ లైన్ లో అర్జీలను పరిష్కరించాలని చెప్పారు. తహశీల్దార్ లు అందరూ భూ సంబంధిత ఫిర్యాదుల పరిష్కారం వారం రోజుల్లోగా పూర్తి చేయాలన్నారు. మ్యుటేషన్, సక్షేషన్ మినహా



మిగితా దరఖాస్తులు పెండింగ్లో ఉండవద్దన్నారు. అలాగే మీసేవ సర్వీసెస్ పెండింగ్ పై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. మండలాలలో కుల, ఆదాయ సర్టిఫికెట్ , తదితర సర్టిఫికేట్ లు పెండింగ్ లేకుండా రోజు వారిగా క్లియర్ చేయాలన్నారు. మీ సేవా సర్వీసెస్ లో ఉన్న పెండింగ్ దరఖాస్తులను మిషన్ పరిష్కరించాలలని ఆదేశించారు. త్వరలో పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఫారం -6,7,8 దరఖాస్తుల పరిష్కారం పై దృష్టి పెట్టాలని సూచించారు. ఓటరు జాబితాలో డబుల్, డూప్లికేట్, డెత్ ఓటర్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అర్హులైన యువతను ఓటర్లుగా నమోదు పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఓటు నమోదుకు అర్హతగల పూర్వ విద్యార్థుల వివరాలను పాఠశాలల నుంచీ తీసుకుని వారిలో ఎవరైనా ఓటు హక్కు కోసం నమోదు చేసుకోకుంటే వారిని వెంటనే నమోదు చేసుకునేలా చూడాలన్నారు. ఈ నెల 22 వ తేదీ తర్వాత %దీూా% నుండి తమ బూత్ పరిధిలో డూప్లికేట్ ఓటరు లు లేరనే సర్టిఫికేట్ తీసుకోనున్నందునఅర్హత గల ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు కు, ఆరోగ్యకర ఓటరు జాబితా తయారీకిఓటు హక్కు నమోదు కోసం తహసిల్దార్లు బీఎల్ఓ లు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడి సూపర్ వైజర్లతో సమావేశం నిర్వహించాలని సూచించారు. ధరణీ పెండింగ్ అర్జీలను వచ్చే శనివారం లోగా పరిష్కరించాలని, సంబంధిత రిపోర్ట్ ను అందజేయాలని తహశీల్దార్ లను కలెక్టర్ ఆదేశించారు. శనివారం సాయంత్రం కల్లా ఏ మండలాలలో అతి ఎక్కువ ధరణీ పెండింగ్ అర్జీలు ఉంటే సంబంధిత టాప్ 3 మండలాల తహశీల్దార్ లు సోమవారం కలెక్టరెట్ కు వచ్చి క్లియర్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా అదనపు కలెక్టర్లు ఎన్ ఖీమ్యా నాయక్, పూజారి గౌతమి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి గంగయ్య ,జిల్లా పౌరసరఫరాల అధికారి జితేందర్ రెడ్డి ,పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ జితేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.




### శబ్ద కాలుష్యానికి కారణమైన రెండు బుల్లెట్ లు సీజ్

**- ఎస్సై. డి. సుధాకర్.**

**సూర్య. ఇల్లంతకుంట**

బైక్ ల సైలెన్సర్ లను మార్చి శబ్ద కాలుష్యానికి కారణమైన రెండు బెల్లెట్ (రాయల్ ఎన్ఫీల్డ్ )ద్విచక్ర వాహనాలను బుధవారం సీజ్ చేసినట్లు ఎస్సై డి. సుధాకర్ తెలిపారు. కరీంనగర్ కు చెందిన యువకుడిది,మరోటి ఇల్లంతకుంట మండలానికి చెందిన యువకులు మార్చిన సైలెన్సర్ లను తొలగించి, కంపెని సైలెన్సర్ తెప్పించి వాటికి బిగించి తర్వాత అట్టి వాహనాలను విడుదల చేయడం జరిగిందని,ఎవరైనతమ యొక్క ద్విచక్ర వాహనాలకు ఉన్న కంపెనీ నుండి వచ్చిన సైలెన్సర్లు తొలగించి శబ్ద కాలుష్యానికి కారణమయ్యే సైలెన్సర్లను ఏర్పాటు చేసి శ్రద్ధ కాలుష్యాన్ని సృష్టించినట్లయితే అట్టి వాహనాలను సీజ్ చేసి, వాహన చోటుకులపై కేసు నమోదు చేయడం జరుగుతుందనిఎస్సై డి సుధాకర్ హెచ్చరించారు.

## జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ లను కలిసిన డోర్స్ నూతన కార్యవర్గం

**-అభినందనలు తెలిపిన కలెక్టర్**

**సూర్య రాజన్న సిరిసిల్ల**



జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్ ఎన్ ఖీమ్యా నాయక్ లకు డోర్స్ నూతన కార్యవర్గ సభ్యులు బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లో మర్యాదపూర్వకంగా కలిశారు. తమ ఎంపికను జిల్లా కలెక్టర్ కు తెలియజేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా అధికారుల అసోసియేషన్ ( డోర్స్) నూతన కార్యవర్గ సభ్యుల ఎంపిక ఇటీవలే జరిగింది. డోర్స్ ఫౌండర్ చైర్మన్ గా అదనపు కలెక్టర్ ఎన్ ఖీమ్యా నాయక్ ఉండగా, డోర్స్ అధ్యక్షుడు గా జిల్లా రవాణా అధికారి వై కొండల్ రావు, జనరల్ సెక్రటరీ గా ఎ వినోద్ కుమార్, కోశాధికారిగా పిబి శ్రీనివాస చారి , ప్రచార కార్యదర్శిగా మామిండ్ల దశరథం ఎంపికయ్యారు.నూతన నియామకం అయిన డోర్స్ అధ్యక్షులు జిల్లా రవాణా అధికారి వై కొండల్ రావు, కోశాధికారిగా పిబి శ్రీనివాస చారి , జాయింట్ సెక్రటరీ బి గంగయ్య , ప్రచార కార్యదర్శులు మామిండ్ల దశరథం, భాస్కర్, కార్యవర్గ సభ్యులు లక్ష్మి రాజం లు డి ఆర్ డి ఓ నక్క శ్రీనివాస్,అదనపు డి ఆర్ డి ఓ మదన్ లు కలెక్టర్ ను కలిశారు. డోర్స్ నూతన కార్యవర్గ సభ్యులను జిల్లా కలెక్టర్ అభినందించారు. ప్రభుత్వ శాఖల అధికారుల మధ్య సమన్వయం పెంపొందిస్తూ ప్రభుత్వ నిర్దేశిత లక్ష్యాల సాధనకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు.

### నూతన ఎస్ ఐ ని కలిసిన మండల బిఆర్ఎస్ నాయకులు

**సూర్య బోయినపల్లి**



బోయినపల్లి నూతన సబ్ ఇన్స్పెక్టర్ బాధ్యతలు స్వీకరించిన ఎస్సై శ్రీకాంత్ నాయక్ ను బుధవారం బిఆర్ఎస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించారు. ఎస్సై నీ కలిసిన వారిలో గుంటి శంకర్, ముద్దం రవీందర్ గౌడ్ , భీమనాథని రమేష్,నల్లగొండ అనిల్ కుమార్ గౌడ్ , వాసాల శ్రీనివాస్, బోజ్జ ప్రభాకర్, శ్రీపతి రాజమౌళి , పేగ్గర్ల శంకరయ్య, దాసరి సుధాకర్ తదితరులు ఉన్నారు.

### సిరిసిల్ల టౌన్ సి ఐ గా బాధ్యతలు స్వీకరించిన బి. రఘుపతి

**సూర్య రాజన్న సిరిసిల్ల.**



సిరిసిల్ల పట్టణ నూతన సీఐ గా బి రఘుపతి బుధవారం బాధ్యతలు స్వీకరించారు సిరిసిల్ల పట్టణ సిఐ ఉపేందర్ బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో నూతన సిఐగా బి రఘుపతి బాధ్యతలు స్వీకరించారు అంతకుముందు రఘుపతి సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని క్రైమ్ బ్యూరో రికార్డ్స్ లో పనిచేశారు. పట్టణ నూతన సిఐ గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా సి.ఐ రఘుపతి మాట్లాడుతూ పట్టణ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవలు అందిస్తానని, ప్రజలకు ఏదైనా సమస్య ఉంటే నేరుగా వచ్చి కలవాలని, శాంతి భద్రతల విషయంలో అందరూ సహకరించాలని కోరారు.

### హామీలు నెరవేరుస్తుంది కాంగ్రెస్ ప్రభుత్వం.

**- మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ.**

**సూర్య. ఇల్లంతకుంట**



ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం నెరవేర్చుతుందని మానకొండూర్ ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. బుధవారం మండలం లోని జంగారెడ్డిపల్లే గ్రామంలో శ్రీ రామలింగేశ్వరస్వామీ జాతర ఉత్సవాల్లో పాల్గొన్న అనంతరం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశం లో అయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ కొద్ది రోజుల్లోనే మహిళలకు బస్ లోఉచిత ప్రయాణం చేసిందన్నారు. ఎన్నికల్లో ప్రతి హామీ నెరవేర్చుతుందని తెలిపారు. రామలింగేశ్వరస్వామీ ఆలయ అభివృద్ధి కి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం అనంతగిరి అన్నపూర్ణ జలాశయం,తిప్పాపూర్ గ్రామంలోని పంప్ హౌజ్, మోటార్ల పని తీరును,సర్జ్ పూల్ ను పరిశీలించిన ఆనంతరం అధికారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఓబులపూర్ వద్ద గల మిడ్ మనేరు జలాశయంను సందర్శించి, అన్నపూర్ణ రిజర్వాయర్ కు వెళ్ళే టన్నెల్ కెనాల్ లను పరిశీలించారు.ఎంపీపీ వూట్కురి వెంకటరమణా రెడ్డి,ఇ ఇ రవీందర్ రెడ్డి, ఎంపీటీసీలు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, పాల్గొన్నారు

### రామలింగేశ్వరుడిని దర్శించుకున్న మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే.

**సూర్య.ఇల్లంతకుంట**



మండలంలోని జంగంరెడ్డి పల్లి శ్రీరామలింగేశ్వర స్వామి రథోత్సవ కార్యక్రమంలో కరీంనగర్ మాజీ పార్లమెంటు సభ్యులు బోయినపల్లి వినోద్ కుమార్, మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ లు కలిసి స్వామి వారిని దర్శించుకున్నారు. వేదపండితులు అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఆలయ కమిటీ సభ్యులు స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేశారు.స్థానిక సర్పంచ్ తూంకుంట శ్రీలత నరేందర్ రెడ్డి, నాయకులు వున్నారు.

### బైండోవర్ ఉల్లంఘన, 50 వేలు జరిమానా

**సూర్య కోనరావుపేట**



కోనరావుపేట మండలం నిమ్మపల్లి(గొల్లపల్లి) గ్రామానికి చెందిన చేకూట దేవయ్య అనే వ్యక్తి బైండోవర్ ను ఉల్లంఘించినందున తహశీల్దార్ విజయప్రకాశ్ రావు రూ.50 వేలు జరిమానా విధించారు. గత సంవత్సరం సెప్టెంబర్ లో మూల వాగు నుండి అక్రమంగా ఇసుక తరలిస్తుండగా చేకూట దేవయ్య ను పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. ఆరు నెలల పాటు సత్ప్రవర్తన కలిగి ఉండాలని తహశీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. కానీ దేవయ్య తన ప్రవర్తన మార్చుకోకుండా డిసెంబర్ లో మళ్లీ మూలవాగు నుండి ఇసుకను తరలిస్తుండగా పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. బైండోవర్ నిబంధనలను ఉల్లంఘించినందుకు తహశీల్దార్ విజయ్ ప్రకాష్ రావు బుధవారం రూ.50 వేలు జరిమానా విధించగా ట్రెజరీలో జరిమానా చెల్లించారు. ఎవరైన బైండోవర్ నిబందనలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎస్సై ఆంజనేయులు హెచ్చరించారు.

## కులం పేరుతో దూషించి కొట్టిన మహిళ రిమాండ్ కి తరలింపు

**సూర్య వేములవాడ టౌన్**



వేములవాడ రూరల్ మండలం జయవరం గ్రామ శివారులో జరిగిన ఘటన లో దళిత మహిళను కులం పేరుతో దూషించి కొట్టిన మహిళను రిమాండ్ కి తరలించినట్టు వేములవాడ డి.ఎస్.పి నాగేంద్ర చారి తెలిపారు. గత వారం రోజుల కింద వేములవాడ రూరల్ మండలం జయవరం గ్రామ శివారులో పత్తి ఎరుటకు మల్లారం కి చెందిన వజ్రవ్వ జోగాపూరి కి చెందిన సునీత ఇద్దరూ రాగ సునీత కులం పేరుతో దూషించి కర్రతో కొట్టగా వజ్రవ్వకు ఎడమ చేతి మీద కొట్టగా తీవ్ర గాయాలు అయ్యాయి. విచారణ జరిపి జరిగిన విషయం నిజమే అని నిరూపణ అయినందున సునీతను రిమాండ్ కి తరలించినట్లు డీఎస్పీ నాగేంద్ర చారి తెలిపారు

### వరుస దొంగతనాలతో మండలములో అయోమయం

**సూర్య ముస్తాబాద్**



ముస్తాబాద్ మండల కేంద్రములో మొన్నటి వరకు వరుస దొంగ తనాలతో అట్టుడికిపోయింది. బిట్ల వెంకటేష్ ఇంట్లో దొంగతనము జరిగి రెండు రోజులు కాక ముందే,చికొడ్ గ్రామములో ఎల్లమ్మ గుడిలో గల్లా పగులగొట్టి,కొత్తకొండ చంద్రగౌడ్ షాప్ లో20 వేల రూపాయలు ఎత్తు కెల్లినట్లు, గున్నాల శ్రీనివాస్,ఇంకో ఐదుగురి కల్లు కుండలు పగులగొట్టి వెళ్లారని గౌడ కులస్తులు తెలిపారు.ఇలా వరుస దొంగతనాలు జరగడము వల్ల మండల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

## మహిళల సాధికారత పై అవగాహన.

**సూర్య,రాయికల్**



మండలం లోని ఇటిక్యాల గ్రామంలో గల వసుంధర మహిళా మండలి ఆధ్వర్యంలో మహిళా సాధికారత బృందం సభ్యులు మహిళలకి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళలకి మిషన్ శక్తి స్కీం,మహిళా సాధికారత గురించి,181-సఖీ,1098 -చైల్డ్ హెల్ప్ లైన్, మరియు వివిధ హెల్ప్ లైన్ ల గురించి వివరించారు.మహిళా శిశు సంక్షేమ శాఖ సేవలు సద్వినియోగం చేసుకోవ్వాలని,60 సంవత్సరాల దాటిన వయవృద్ధులకు పింఛన్ రాకపోయినా, ఇంట్లో పిల్లలు తల్లిదండ్రులను బాగా చూసుకోకపోయినా,14567 నెంబర్ కు ఫోన్ చేయాలి అని సూచించారు.వికలాంగుల పింఛన్లు సదరం సర్టిఫికెట్ల కోసం, ట్రై సైకిల్ కోసం దరఖాస్తు చేసుకోవాలన్న 155326 హెల్ప్ లైన్ నెంబర్ కి ఫోన్ చేయాలన్నారు. అలాగే బేటి బచావో బేటి పడావో మరియు సుకన్య సమృద్ధి యోజన,బాల్య వివాహాల వల్ల వచ్చే నష్టాల గురించి వివరించడం జరిగింది.ఇట్టి కార్యక్రమం లో మహిళ సాధికారత జెండర్ స్పెషలిస్ట్ గౌతమి, ఫైనాన్షియల్ లిటరసీ హేమాశ్రీ ,సఖి లీగల్ అడ్వైసర్ లావణ్య, సఖి సోషల్ వర్కర్ శారద,మహిళ్లా సంఘం అధ్యక్షురాలు రాధ,లావణ్య పాల్గొన్నారు.

# రుడాపై కోటి ఆశలు

## -రామగుండంలో బీసీ మేయర్ కోసం పావులు కదుపుతున్న నాయకులు!?

**సూర్య-గోదావరిఖని:**
రామగుండం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (రుడా) పై స్థానికంగా ఉన్న కొంతమంది అధికార పార్టీకి చెందిన నాయకులు కోటి ఆశలు పెట్టుకున్నట్లు తెలుస్తోంది. అసలు విషయానికి వస్తే అర్బన్ డెవలప్మెంట్ అథారిటీలు భారతదేశంలోని నగరాల్లో ప్రణాళికాబద్ధమైన మౌలిక సదుపాయాలు, గృహ ప్రాజెక్టుల అభివృద్ధి కోసం సృష్టించబడిన చట్టబద్ధమైన పౌర సంస్థలు. భారత రాజ్యాంగంలోని 74వ సవరణ ప్రకారం ప్రతి పట్టణానికి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీని ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంటుంది. ఇట్టి అథారిటీ అధికారులు టౌన్ ప్లానింగ్ కార్యకలాపాలలో రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి పని చేస్తారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల ముందు రామగుండం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఏర్పాటు కావలసి ఉండగా, దాదాపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఇందుకు సంబంధించిన ఫైల్ సిద్ధం చేసినప్పటికీ, అప్పటి ముఖ్య ప్రజా ప్రతినిధి అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఆగిపోయినట్లు సమాచారం. అయితే ఇప్పుడు తాజాగా మళ్లీ రుడా అంశం తెరపైకి రావడం, అధికార పార్టీకి చెందిన ఇద్దరు ముగ్గురు నాయకులు రుడా చైర్మన్ పదవిని ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని పక్కన పెడితే రామగుండం మున్సిపాలిటీ నగరపాలక సంస్థ గా




అప్ గ్రేడ్ అయ్యే సమయంలో రూ.10 కోట్ల ఆదాయం, 10 లక్షల జనాభా ఉండాల్సి ఉండగా, ఆ సమయంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా రామగుండం మున్సిపాలిటీ ని నగరపాలక సంస్థగా అప్ గ్రేడ్ చేసింది. నగరపాలక సంస్థ పరిధిలో 95 శాతం వరకు భూములు నివాసయోగ్యంగా ఉండడం, పశువులు ఇతరత్రా జంతువులు రోడ్లపై కనబడకూడదనే ఖచ్చితమైన నిబంధనలు ఎన్నో ఉన్నప్పటికీ వాటిని తుంగలో తొక్కి అప్పటి రాజకీయ నాయకులు కార్పొరేషన్ గా అప్ గ్రేడ్ అయ్యేందుకు సర్వశక్తులు ఒడ్డి సఫలీకృతులయ్యారు. ఇప్పుడు కూడా రుడా కోసం ప్రయత్నాలు ముమ్మరంగా జరుగుతుండడం, గత మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఉన్నటువంటి రిజర్వేషన్లను సైతం తొలగించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. 2019 మున్సిపల్ ఆక్ట్ ప్రకారం రెండు పర్యాయాలు రిజర్వేషన్లు ఒకే విధంగా ఉండాలనే నిబంధన ఉండగా, ఆ నిబంధనలను మార్చేందుకు కొంతమంది ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకవస్తున్నట్లు సమాచారం. అయితే కొత్తగా సూర్యాపేట, సిద్దిపేట, మహబూబ్ నగర్, మంచిర్యాల మున్సిపాలిటీ లు నగరపాలక సంస్థగా అప్ గ్రేడ్ అయ్యే అవకాశాలు ఉన్న నేపథ్యంలో రొటేషన్ పద్ధతిలో రామగుండం మేయర్ పీఠం బీసీ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఒకవేళ లాటరీ విధానాన్ని అనుసరిస్తే ఆయా సామాజిక వర్గాల నాయకుల అదృష్టంపై ఆధారపడి ఉంటుంది. 2004 నుండి రామగుండం మున్సిపల్ చైర్మన్ గా ఒకసారి, మేయర్ గా రెండు పర్యాయాలు ఎస్సీ సామాజిక వర్గానికి చెందినవారు ఉండడంతో, ఈసారి ఎలాగైనా మేయర్ పీఠంపై బీసీ సామాజిక వర్గానికి చెందిన నాయకుడు కూర్చోవాలనే ఆలోచనలో ఇక్కడి అధికార పార్టీకి చెందిన నాయకులు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అవసరమైతే బీసీ మహిళ ను మేయర్ పీఠంపై చూడాలనే ఆశతో ఇక్కడి కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నట్లు సమాచారం. మొత్తానికి రామగుండం నగరపాలక సంస్థలో రుడా, ఆయా డివిజన్ లు, మేయర్ కు సంబంధించిన రిజర్వేషన్ మార్పు పై నగరంలో జోరుగా చర్చ జరుగుతోంది.

## కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చే ఉద్దేశ్యం బిఆర్ఎస్ కులేదు.

**- మాజీ ఎంపి బోయినపల్లి వినోద్ కుమార్.**

**సూర్య. ఇల్లంతకుంట.**
కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చే ఉద్దేశ్యం బీఆర్ఎస్ పార్టీకి లేదని, హామీలు అమలు చేయకుంటే ప్రజలే ప్రభుత్వాన్ని కూల్చుతారని కరీంనగర్ మాజీ ఎంపి బోయినపల్లి వినోద్ కుమార్



పేర్కొ న్నారు. బుధవారం మండలం లోని జంగారెడ్డి పల్లే గ్రామంలోని శ్రీ రామలింగేశ్వర స్వామీ జాతర ఉత్సవాల్లో రాథోత్సవం లో మాజీ ఎంపి బోయిన పల్లి వినోద్ కుమార్, మాజీ ఎమ్మెల్యే డా. రసమయి బాలకిషన్ లు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఈ సందర్భంగా మండల కేంద్రం లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశం లో ఆయన మాట్లాడుతూ కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ నోటి కొచ్చినట్టు మాట్లాడుతున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం కూలబోతుంది అని హెచ్చరిక చేయడం, కాంగ్రెస్, బీజేపీ పార్టీలు కలిసి పని చేద్దాం అని మాట్లాడడం విచిత్రంగా ఉందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చే ఆలోచన బీఆర్ఎస్ కు లేదని, 39 మంది ఎమ్మెల్యేలు, శాసనమండలిలో మెజారిటీ సభ్యులతో బీఆర్ఎస్ బలమైన ప్రతిపక్షంగా ఉందన్నారు. బీఆర్ఎస్ ప్రజా సమస్యలపై పోరాటం చేస్తోందని,బీఆర్ఎస్ పార్టీపై బండి సంజయ్ చేస్తున్న ఆరోపణలు సరికాదని, బండి సంజయ్ నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని హితవు పలికారు. కేసీఆర్ ప్రభుత్వం పదేళ్లు ప్రజల ఆశీర్వాదంతో పని చేసిందని దేశ చరిత్రలో ఏ ప్రభుత్వాలు చేయలేని రైతుబంధు పథకం ద్వారా ఎకరాకు?10వేల పెట్టుబడి సాయం, రైతుభీమా ద్వారా రైతులు మరణిస్తే ?5లక్షల సాయం, కల్యాణ లక్ష్మీ, షాదీముబారక్ ద్వారా ఆడబిడ్డ పెళ్లికి ?లక్ష116 సాయం చేసిందాన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు యాసంగి నుంచి క్వింటాలు కు?500, రైటుభరోసా పథకం ద్వారా ?15000లు,, కళ్యాణలక్ష్మీ ద్వారా ? లక్షతో పాటు తులం బంగారం, 2లక్షల రుణమాఫీ వంటి హామీలను నమ్మి ప్రజలు ఓట్లు వేశారన్నారు. వంద రోజుల్లో ఇచ్చిన హామీలను నెరవేరు స్తామన్న కాంగ్రెస్ హామీ కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని, మహాలక్ష్మి పథకం ద్వారా 2500 ల సాయం చేస్తామన్నారు. 200ల యూనిట్ల విద్యుత్ బిల్లు మాఫీ చేస్తామన్నారు. కరెంటు బిల్లు కాంగ్రెస్ పార్టీ, సోనియాగాంధీ కడతారని స్వయన సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభల్లో మాట్లాడినారని, కాంగ్రెస్ ప్రభుత్వం వంద రోజుల్లో 200 యూనిట్ల కరెంటు, తులం బంగారం, మహాలక్ష్మి ద్వారా 2500, ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణం కోసం? 5లక్షల సాయం వంటి హామీలు నెరవేర్చకుంటే ప్రతిపక్ష పార్టీగా బీఆర్ఎస్ పోరాటం తప్పకుండా చేస్తోందన్నారు. కాంగ్రెస్ పై ప్రజలు ఎన్నో ఆశలతో ఓట్లు వేశారని ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే ప్రజలే గుణపాఠం చెబుతారన్నారు. ఈ సమావేశం లో జడ్పి వైస్ చైర్మన్ సిద్ధం వేణు, సెస్ డైరెక్టర్ మల్లుగారి రవీందర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు పల్లే నర్సింహారెడ్డి, ప్రజా ప్రతినిధులు,నాయకులు వున్నారు.

## రామలింగేశ్వరుడి జాతర ఉత్సవాల్లో, రేణుక ఎల్లమ్మ తల్లీని దర్శించుకున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

**సూర్య.ఇల్లంతకుంట**
మండలంలోని జంగంరెడ్డి పల్లి శ్రీరామలింగేశ్వర స్వామి రథోత్సవ కార్యక్రమంలోస్వామీ వారిని, కంది కట్కూరు గ్రామంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లీని బుధవారం మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ దర్శించుకున్నారు. వేదపండితులు అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఆలయ కమిటీ సభ్యులు స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేశారు.ఎంపిపి వూట్కూరి వెంకటరమణారెడ్డి,మండల పార్టీ అధ్యక్షులు భూం పల్లి రాఘవ రెడ్డి,నాయకులున్నారు.



## పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం.

**- ప్రభుత్వ విప్ ,ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**

**సూర్య కోనరావుపేట**
పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యమని, పల్లె దవాఖాన ద్వారా ప్రజలకు ఆర్థిక భారం తగ్గుతుందని ప్రభుత్వ విప్ , ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. కోనరావుపేట మండలంలోని వట్టిమల్ల గ్రామంలో రూ.16 లక్షలతో నిర్మించిన పల్లె దవాఖానను, వివిధ కుల సంఘ భవనాలకు భూమిపూజ కార్యక్రమాన్ని గురువారం జడ్పీ చైర్మన్ న్యాలకొండ అరుణరాఘవరెడ్డి తో కలిసి ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ... ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి ప్రాధాన్యమిస్తున్నదని అన్నారు.పల్లె దవాఖానల ఏర్పాటుతో ప్రజల చెంతకే వైద్యంతో పాటు గ్రామీణ ప్రాంతాల ప్రజలపై ఆర్థిక భారం తగ్గిపోయిందని, సాధారణంగా గ్రామాల్లో ఎవరైనా అనారోగ్యానికి గురైతే ప్రైవేట్ డాక్టర్లను ఆశ్రయించి వేలాది రూపాయలు ఖర్చు చేస్తుంటారు. ఫీజులు, పరీక్షలు, అదే స్థాయిలో మందులు ఇలా దాదాపు వేలల్లో ఖర్చవుతుందని, పల్లె దవాఖానల ద్వారా ఎలాంటి ఫీజు లేకుండా వైద్యులు పరీక్షించి ఉచితంగానే మందులు కూడా అందిస్తుండడంతో పేదలపై ఆర్థిక భారం తగ్గిపోతుందని తెలిపారు. పేదలకు మెరుగైన



వైద్య సేవలు అందించడం రాష్ట్రం ప్రభుత్వం లక్ష్యమని, అందులోభాగంగానే ఆరోగ్యశ్రీ పరిమితిని 10 లక్షల వరకు పెంచడం జరిగిందని అన్నారు.ప్రభుత్వ దవాఖాన లో ప్రైవేట్ దవాఖానల కంటే మెరుగైన వైద్యం అందిస్తున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపిపి ఎదురుగట్ల చంద్రయ్య గౌడ్,సర్పంచ్ కొమ్ము స్వప్న దేవరాజు,రాష్ట్ర మార్కుఫెడ్ డైరెక్టర్ బండ నర్సయ్య యాదవ్,మండల వైద్యాధికారి వేణుమాధవ్, సర్పంచుల మండల కన్వీనర్ గోపు పర్శరాములు, సర్పంచ్ సూర్య నాయక్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు షేక్ ఫిరోజ్ పాషా,జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు కేతిరెడ్డి జగన్మోహన్ రెడ్డి,ఉపసర్పంచ్ పుంగం గౌడ్,ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు గండి నరేష్,నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణలో బ్లూ కోల్ట్స్, పెట్రో కార్ సిబ్బంది పాత్ర కీలకం

**-జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**

**సూర్య రాజన్న సిరిసిల్ల**
సమాజంలో నేరాల నియంత్రణలో కోల్ట్స్, పెట్రో కార్ సిబ్బంది పాత్ర కీలకమని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయ ంలో జిల్లా పరిధిలోని బ్లూ కోల్ట్స్, పెట్రో కార్ సిబ్బందికి నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఎస్పీ



పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డయల్ 100 కు కాల్ చేయగానే పోలీసులు వచ్చి సమస్య పరిష్కరిస్తారని ప్రజలకు నమ్మకం కలిగేలా విధులు నిర్వహించాలన్నారు.నేరాలు జరిగే ప్రదేశాలను గుర్తించి వాటిపై నిఘా ఉంచాలన్నారు.సస్పెక్ట్, రౌడీ, కేడి, డిసిలను, విధిగా పాయింట్స్ బుక్స్ చెక్ చేయాలని ఆదేశించారు. ప్రాపర్టీ సంబంధిత నేరాల నియంత్రణలో బ్లూ కోల్ట్స్ మరియు పెట్రో కార్స్ అధికారుల పాత్ర కీలకం అని, డయల్ 100 కాల్ వచ్చినప్పుడు అత్యవసర సమయంలో బాదితులకి వేగవంతమైన స్పందన తప్పక ఇవ్వాలని తక్కువ సమయంలోనే సంఘటన స్థలానికి చేరుకుని సమస్యను పరిష్కరించే విధంగా సేవలు అందించాలని, బ్లూ కోల్ట్స్ మరియు పెట్రో కార్ సిబ్బంది, ప్రజల పట్ల బాధ్యతగా మెలగాలని, అనుక్షణం ప్రజలకు అందుబాటులో ఉంటూ, అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలన్నారు. విసిబుల్ పోలీసింగ్ లో భాగంగా అత్యవర సేవలు అయిన రోడ్డు ప్రమాదాలు, అగ్నిప్రమాదాలు, పట్టణాల, గ్రామాలలో జరిగే అవాంఛనీయ సంఘటనలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు మొదలైన వాటికి సంబందించిన డయల్ 100 కాల్ ద్వారా సమాచారం అందిన వెంటనే ఆ ప్రాంతంలో అందుబాటులో ఉన్న బ్లూ కోల్ట్ సిబ్బంది లేదా పెట్రోల్ వెహికల్స్ సిబ్బంది తక్షణమే స్పందించి తగు చర్యలు అందించాలన్నారు. ప్రజలలో భద్రతభావం పెంపొందిస్తూ నేరస్థులకు నేరం చేస్తే పట్టుబడుతామనే భయం కల్గించే లక్ష్యంతో బ్లూ కోల్ట్స్ సిబ్బంది విభాగంలోని అధికారులు తమ ఏరియా పై సమగ్ర సమాచారం కలిగి ఉండి ఆప్రాంత ప్రజల రక్షణకు భరోసా కల్పించాలని అన్నారు.గస్తీ తిరుగుతున్న ఏరియా నుండి రిపోర్ట్ చేయబడిన అన్ని డయల్100 ఫిర్యాదులను నిర్ణిత సమయంలో అటెండ్ చేయడంతో పాటు బాధితులకు సత్వర సేవలు అందించాలన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య,వర్టికల్ డిఎస్పీ రవీందర్, సి.ఐ కరుణాకర్, సి.ఐ వెంకటేష్, బ్లూ కోల్ట్ మరియు పెట్రో కార్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజల రక్షణ, భద్రతయే పోలీస్ బాధ్యత

## - నేరాల నియంత్రణలో ప్రజలు భాగస్వామ్యం కావాలి
## - అనుమానిత వ్యక్తులు కనపడితే సమాచారం అందించాలి
## - జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**సూర్య వేములవాడ (02)**

వేములవాడ పట్టణ పరిధిలోని న్యూ అర్బన్ కాలనిలో నిర్వహించిన కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ ,ట్రైనీ ఐపీఎస్ రాహుల్ రెడ్డి పాల్గొన్నారు. సరైన పత్రాలు లేని13 ద్విచక్ర వాహనాలు, 2 ఆటోలు సీజ్ చేశారు. సబంధించిన వాహన దారులకు సరైన పత్రాలు చూపించి, వాహనాలు తీసుకవేళ్ళవచ్చున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నేరాల నిర్మూలన కోసమే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజల రక్షణ, భద్రత పోలీస్ బాధ్యత అని , గ్రామాల్లో కొత్త వ్యక్తులు, నేరస్తులు, షెల్టర్ తీసుకుని ఉంటే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ కూడదని, యువత చెడు అలవాట్లకు బానిసగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. ప్రతి



ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని, వాహనాలు నడిపే టప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలి అని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్ అందరు కలిగి ఉండాలని, ప్రతి వాహనదారుడు తమ తమ వాహనాలకు నెంబర్ ప్లేట్స్ కలిగి ఉండాలని అన్నారు.ప్రతి ఒక్కరు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, మొబైల్ ఫోన్ కి వచ్చే లింక్స్ ఓపెన్ చేయకూడదు అని,మీ ప్రమేయం లేకుండా మీ మొబైల్ ఫోన్ కి వచ్చే ఓటీపి ఎవరికి కూడా చెప్పవద్దన్నారు. ఒకవేళ సైబర్ మోసానికి గురైనట్లు మీరు గుర్తిస్తే వెంటనే 1930కి కాల్ చేయాలని అన్నారు. గంజాయి ,జూదం లాంటి చెడు లాంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, కాలనిలో గంజాయి తగిన, విక్రయించిన నేరం అని గంజాయి కి సంబంధించిన సమాచారం ఉంటే పోలీస్ వారికి సమాచారం అందించాలన్నారు. గ్రామాలలో మరింత స్వీయ రక్షణ కొరకు సీసీ కెమెరాలను అమర్చుకోవాలని, ఈ విషయంలో పోలీసుల సహకారం ఉంటుందని, భద్రతా పరమైన అంశాల లో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఎస్పీ వెంట డీఎస్పీ నాగేంద్రచారి, సిఐలు కరుణాకర్, కృష్ణకుమార్, కిరణ్ కుమార్, ఎస్ఐలు పోలీస్ సిబ్బంది ఉన్నారు.



## రాజన్న హుండీ ఆదాయం 2.52 కోట్లు

**సూర్య, వేములవాడ**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కింపు నిర్వహించారు. 21 రోజుల హుండీ ఆదాయం నగదు రూ.2 కోట్ల 52లక్షల 29 వేల 580 రాగా, బంగారం 277 గ్రాముల, 100 మిల్లి గ్రాములు, వెండి 13 కిలోల 280 గ్రాములు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కృష్ణ ప్రసాద్ వెల్లడించారు. ఈ హుండీ లెక్కింపులో ఏఈఓ, పర్యవేక్షకులు, ఆలయ ఉద్యోగులు, పొరుగు సేవల ఉద్యోగులతో పాటు శివరామకృష్ణ భజన మండలి సేవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

## వినియోగదారుల సమస్యలు వెంటనే తీర్చాలి.

### - సి ఎం డి కర్ణాటి వరుణ్ రెడ్డి

**సూర్య జగిత్యాల**

వినియోగదారుల సమస్యలు వెంటనే తీర్చాలని వరంగల్ టి ఎస్ ఎన్ పి డి సి ఎల్ ఛైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. జగిత్యాల జిల్లాలోని విద్యుత్ అధికారులతో నెల వారి సమీక్ష సమావేశమును జగిత్యాల కలెక్టర్ కార్యాలయంలోని మీటింగ్ హాల్ లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భముగా సిఎండి మాట్లాడుతూ, అన్ని కేటగిరీల వినియోగదారులకు అంతరాయాలు లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలనీ, ఇందుకై విద్యుత్ లైన్లను, ట్రాన్స్ ఫార్మర్లను తరచుగా మెయింటెనెన్స్ చేయాలనీ ఆదేశించారు. వినియోగదారులతో మర్యాదగా ప్రవర్తిస్తూ వారి సమస్యలను వీలైనంత త్వరగా తీర్చాలని, బిల్లులు ఆన్లైన్ ఆప్ ద్వారా చెల్లించేలా అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో ట్రాన్స్ ఫార్మర్లు అధికంగా కాలిపోతున్నాయని, వాటికి అవసరమైన లైటెనింగ్ అరెస్టర్ లు, ఎర్తింగ్, ఏ. బి. స్విచ్లు ఏర్పాటు చేయాలనీ, స్పేసర్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఫీల్డ్ సిబ్బందికి రోజు వారి పనుల నిర్వహణ ముందుగా తెలియజేసి, సంబంధిత ఏ ఈ లు, ఏ డీ ఈ లు పనులు అన్ని పూర్తి అయ్యేలాగా ఫీల్డ్ లో తిరుగుచూ నాణ్యమైన విద్యుత్ ను వినియోగదారులకు అందించేందుకు కృషి చేయాలన్నారు. ట్రాన్స్ ఫార్మర్ రిపేరు కేంద్రంలో, రిపేర్లు నాణ్యతతో చేసేలా చూడాలన్నారు. కొత్తగా దరఖాస్తు చేసుకున్న వ్యవసాయ వినియోగదారులకు సాధ్యమైనంత త్వరలో అవసరమైన పోల్ లు, ట్రాన్స్ ఫార్మర్ లు ఏర్పాటు చేసి సర్వీస్ లు రిలీజ్ చేయాలన్నారు. రోజూ వారి పని విధానంలో నిర్లక్ష్యం వహించిన అధికారులను హెచ్చరిస్తూ, ఇకపై మెరుగైన పని విధానంతో పని చేయాలనీ సూచించారు. అంతకు ముందు జగిత్యాల జిల్లా కేంద్రంలోని సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించారు. అనంతరం సూపరింటెండింగ్ ఇంజనీర్ సత్యనారాయణ, డీఈలు, ఏడీఈలు సి ఎం డిని పూల మొక్కలతో సత్కరించారు. ఈ సమావేశంలో మోహన్ రెడ్డి, డైరెక్టర్ ఆపరేషన్, గణపతి, డైరెక్టర్ ఐ పి సి, సంధ్యా రాణి, డైరెక్టర్ కమర్షియల్, తిరుపతి రెడ్డి, డైరెక్టర్/ఫైనాన్స్, అనిల్ కుమార్, డీఈ టెక్నికల్ టూ సిఎండి, జిల్లాలోని డీ ఈ లు, ఏడీఈలు, ఏఈలు, ఏ ఏ ఓలు పాల్గొన్నారు.





## అక్రమంగా భూకబ్జాకు పాల్పడిన వ్యక్తుల అరెస్ట్, రిమాండ్ కు తరలింపు

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

కరీంనగర్ లోని భగత్ నగర్ కి చెందిన కొత్త రాజిరెడ్డి మున్సిపల్ పర్మిషన్ ద్వారా ఇంటి నిర్మాణము చేస్తుండగా హైదరాబాద్ నల్లకుంట , ప్రస్తుత నివాసం గంగాధర కు చెందిన చీటీ రామారావు, కరీంనగర్ 12వ డివిజన్ కు చెందిన కార్పొరేటర్ తోట రాములు కలిసి ఇంటి నిర్మాణాన్ని అడ్డుకున్నారని కొత్త రాజి రెడ్డి గత నెల 20 వ తేదీన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కరీంనగర్ వన్ టౌన్ ఎస్సై ఎస్.ఐ. స్వామి కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణలో పై ఇద్దరు వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా రాజి రెడ్డి ఇంటి స్థలాన్ని ఆక్రమించుకోవాలనే దురుద్దేశంతో హద్దులు మార్చి తప్పుడు ధృవపత్రాలు సృష్టించారని విచారణలో తేలింది. ఈ విచారణ కరీంనగర్ కమీషనరేట్ లో నూతనంగా ఏర్పాటైన ఎకనామిక్ అఫెన్సెస్ వింగ్ సహాయంతో వన్ టౌన్ పోలీసులు విచారణ చేపట్టారు. దానిలో భాగంగా పూర్తిస్థాయి విచారణకై పోలీసు బృందం హైదరాబాద్, విశాఖపట్నం సైతం వెళ్లి కేసుకు సంబంధించిన ఆధారాలను సేకరించామని తెలిపారు. ఇప్పటివరకు సేకరించినటువంటి ఆధారాల మేరకు పై వ్యక్తులు అక్రమంగా భూకబ్జాకు పాల్పడ్డారని నిర్ధారించిన కరీంనగర్ వన్ టౌన్ ఇన్స్పెక్టర్ జె.సరిలాల్ పై వ్యక్తులను (Cr. No. 491/2023 u/s 120-B , 447, 427, 465, 467, 468, 471 r/w 34 IPC) అరెస్ట్ చేసి కరీంనగర్ సెంకండ్ అడిషనల్ ఫస్ట్ క్లాస్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ కోర్ట్ లో హాజరు పరచగా న్యాయమూర్తి కేసుపూర్వ పరాలు పరశీలించి ముద్దాయిలకు ఈ నెల 31 వ తేది వరకు రిమాండ్ విధించారు. ఇట్టి కేసుపై విచారణ ఇంకా కొనసాగుతున్నదని పోలీసులు తెలిపారు.



## కరీంనగర్ రూరల్ సబ్ డివిజన్ రివ్యూ మీటింగ్

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

కరీంనగర్ సర్కిల్ కార్యాలయం మీటింగ్ హాల్లో కరీంనగర్ రూరల్ సబ్ డివిజన్ O&M స్టాఫ్ రివ్యూ మీటింగ్ జరిగినది. ఈ మీటింగులో విద్యుత్ సరఫరా, లోపాలను పరిష్కరించుట, లైన్లను బ్రేక్ డౌన్ రాకుండా, ట్రాన్స్ఫార్మర్స్ ఫెయిల్ కాకుండా ఉండడానికి ఏం చేయాలనేది వివరించారు. కన్స్యూమర్స్ కి విద్యుత్ అంతరాయం లేకుండా నిరంతరంగా కరెంటు ఇవ్వాలని ఆదేశించాడు సంస్థ యొక్క అనవసరమైన ఖర్చును తగ్గించాలని కోరారు. ఈ సమావేశంలో కరీంనగర్ సర్కిల్ SEవి గంగాధర్, DE రాజ ADE కొలుపుల రాజు ఏఈలు ,O&M స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.



## అంబేడ్కర్, శివాజీ, బతుకమ్మ విగ్రహాలను ఆవిష్కరించిన ఎంపీ బండి సంజయ్

**సూర్య కొడిమ్యాల:**

జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం లోని దబ్బుతిమ్మయ్యపల్లి గ్రామం లో బుధవారం రోజు డాక్టర్ %దీ=% అంబెద్కర్, ఛత్రపతి శివాజీ,బతుకమ్మ, విగ్రహాలను కరీంనగర్ ఎంపీ బిజెపి పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కుమార్, ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ రోజు చాలా ఆనందంగా అనిపిస్తుంది అని అన్నారు.ఒకే రోజు డాక్టర్ బీఆర్ అంబెద్కర్ ఛత్రపతి శివాజీ బతుకమ్మ విగ్రహాలను ఆవిష్కరించడం అనేది జీవితంలో ఎప్పటికి మరిచి పోలేని రోజు అని చెప్పారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దబ్బు రాధ- గౌతమ్ రెడ్డి, ఎంపిటిసి దబ్బు జగన్ మోహన్ రెడ్డి, కొనపురం సర్పంచ్,మండల పార్టీ అద్యక్షులు రవీందర్ రెడ్డి, గ్రామ ప్రజలు,యువకులు, మహిళలు, పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## బాల కార్మికుల కోసం ఇటుక బట్టీల్లో, హోటళ్లలో తనిఖీలు

**సూర్య, హుజురాబాద్**

ఆపరేషన్ స్మైల్ 10 కార్యక్రమంలో భాగంగా హుజురాబాద్ పట్టణంలోని ఇటుక బట్టీలు, రెస్టారెంట్లు, హొటల్స్, దుకాణలను బుధవారం ఆపరేషన్ స్మైల్ టీం సందర్శించి తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో మైనర్ పిల్లలు ఎవరైనా పని చేస్తున్నారా అని అరా తీశారు. ఈ సందర్భంగా చైల్డ్ హెల్ప్ లైన్ 1098 జిల్లా కో ఆర్డినేటర్ సంపత్ మాట్లాడుతూ యాజమానులకు బాల కార్మిక చట్టాల గురించి తెలియాలన్నారు. బాల కార్మికులను ఎవరు పనిలో పెట్టుకోరాదని సూచించారు. బాలకార్మిక నిర్ములన కోసం అందరు సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ లేబర్ ఆఫీసర్ చందన, బాలల పరిరక్షణ అధికారి రమేష్, చైల్డ్ హెల్ప్ లైన్ కేసు వర్కర్ ప్రియాంక, పోలీస్ కానిస్టేబుల్ రవీందర్, యజమానులు తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి పరామర్శ

**సూర్య, హుజురాబాద్**

ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు సొల్లు బాబు తల్లి సొల్లు సంతోషమ్మ కుటుంబాన్ని బుధవారం జెడిఎస్ సెక్యులర్ పార్టీ రాష్ట్ర నాయకులు వడ్లూరి వాసు సందర్శించి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మృతి పట్ల ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వెంకన్న, మహేందర్ తదితరులు ఉన్నారు.

## సెంట్రల్ స్కూల్ ఏర్పాటు కోసం స్థల పరిశీలన

**సూర్య,రాయికల్**

రాయికల్ మండలంలోని బోర్న పల్లి గ్రామంలో సెంట్రల్ స్కూల్ ఏర్పాటు నిమిత్తం జగిత్యాల నరసింహమూర్తి ఆధ్వర్యంలో అధికారుల బృందం స్థల పరిశీలన చేశారు. గ్రామంలోని సర్వేనెంబర్ 183 లో గల 10 ఏకారాల స్థలాన్ని అధికారులు పరిశీలించారు.వీరి వెంట తాహసిల్దార్ ఎం.ఎ ఖయ్యుం,ఆర్ఐ లు దేవదాసు,కాంతయ్య, గ్రామ ప్రజా ప్రతినిధులు పాదం లత రాజు, ఆంజనేయులు కవిత,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.